అమ్మ పండగ.. అఖిలం నిండుగ



నేటి నుంచి దసరా వేడుకలు

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే ఇంద్రకీలాద్రి

దుర్గమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోనున్నారు. ఇంద్రకీలాద్రి కొండ దిగువన వినాయక ఆలయం వద్ద నుంచి క్యూలైన్లను వేశారు. భక్తులు ఒకసారి క్యూలైన్లలోకి ప్రవేశించాక.. రెండు కిలోమీటర్ల దూరం నడిచి వచ్చి ఘాట్ రోడ్డు మీదుగా వెళ్లి అమ్మవారిని దర్శించుకోనున్నారు. అనంతరం శివాలయం మెట్ల మార్గానికి పక్కనే ఏర్పాటు చేసిన తాత్కాలిక మార్గం, మహామండపంలో ర్యాంప్, మెట్ల మార్గం ద్వారా భక్తులు కిందకు దిగనున్నారు. సరిగ్గా భక్తులు కిందకు దిగే ప్రాంతంలోనే అన్నదాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అన్నప్రసాదం స్వీకరించిన తర్వాత.. పక్కనే కనకదుర్గానగర్‌లో లడ్డూ ప్రసాదం కౌంటర్లను ఏర్పాటు చేశారు. గురువారం నుంచి ఆరంభమయ్యే దసరా వేడుకలు.. ఈనెల 12 వరకూ జరగనున్నాయి. దసరా తొమ్మిది రోజుల్లో.. అమ్మవారు తొమ్మిది రూపాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

దర్శనాల సమయాలు...

ప్రతిరోజు ఉదయం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ భక్తులను అమ్మవారి దర్శనాలకు అనుమతిస్తారు. తొలి రోజు మాత్రం ఉదయం 9 గంటల తర్వాత నుంచి దర్శనాలు ఆరంభమవుతాయి.

తొలిరోజు ఉదయం 9 గంటల నుంచి దర్శనాలు

ఇంద్రకీలాద్రిపై ఘనంగా ఏర్పాట్లు

ఈసారి దసరా వేడుకలు జరిగే తొమ్మిది రోజులు, అనంతరం ఈనెల 13, 14 వరకూ అంతరాలయం దర్శనాలు పూర్తిగా ఆపేస్తున్నట్లు ప్రకటించారు. ముఖమండప దర్శనాలకు మాత్రమే అనుమతిస్తారు. ప్రతిరోజు సాయంత్రం 6.30 నుంచి 7.30 వరకు అమ్మవారి మహానివేదన, పంచహారతులు నిర్వహిస్తారు. ఆ సమయంలో భక్తుల దర్శనాలను గంట సమయం పూర్తిగా ఆపేస్తారు.

25 లక్షల లడ్డూలు..

భక్తులకు విక్రయించేందుకు 25 లక్షల లడ్డూలను దసరా వేడుకల కోసం ముందస్తుగానే సిద్ధం చేస్తున్నారు. వీటిని విక్రయించేందుకు 18కౌంటర్లు ఏర్పాటు చేశారు. కొండ దిగువన కనకదుర్గానగర్‌లో 10, మిగతా ఘాట్లు, బస్టాండ్, రైల్వేస్టేషన్, స్టేట్ గెస్ట్‌హౌస్ వంటిచోట్ల ఒక్కొక్కటి చొప్పున ఎనిమిది కౌంటర్లను ఏర్పాటు చేశారు.



విద్యుత్తు కాంతుల్లో ఇంద్రకీలాద్రి



టిక్కెట్, ఉచిత క్యూలైన్లు..

ఐదు క్యూలైన్లలో భక్తులు అమ్మవారిని దర్శించుకోనున్నారు. వీటిలో రెండు ఉచిత దర్శనం లైన్లు. మిగతావి రూ.100, రూ.300, రూ.500 క్యూలైన్లు. దర్శన టిక్కెట్లను భక్తులకు విక్రయించేందుకు 14 చోట్లా కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో రిసెప్షన్, టోల్‌గేటు, ఓం టర్నింగ్, సహా అన్ని ఘాట్లు, కలెక్టర్ కార్యాలయం, స్టేట్‌గెస్ట్ హౌసు, బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో కౌంటర్లు ఉన్నాయి.



పుష్కలంగా తాగునీళ్లు..

ఉత్సవాలకు తరలివచ్చే భక్తుల కోసం 35 లక్షల తాగునీటి ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను సరఫరా చేసేలా ఏర్పాట్లు చేశారు.

వీఐపీ, వృద్ధులు, దివ్యాంగులకు..

సాధారణ భక్తుల దర్శనాలకు ఆటంకం కలగకుండా ఉండేలా వీఐపీ, వీవీఐపీ దర్శనాలు, వృద్ధులు, దివ్యాంగుల దర్శనాలకు ఈ ఏడాది ప్రత్యేక సమయాలను కేటాయించారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 10, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల మధ్యలో కేటాయించారు. ఈ సమయాల్లోనే రావాలని సూచించారు. ప్రముఖుల రాకపోకల కోసం పున్నమిఘాట్, కలెక్టర్ కార్యాలయం, స్టేట్‌గెస్ట్ హౌస్, భవానీ ఘాట్, జమ్మిదొడ్డి ప్రాంతాల నుంచి 28 ఇన్నోవా వాహనాలు, ఎనిమిది మినీ బస్సులను ఏర్పాటు చేశారు.



దివ్యాంగుల కోసం ప్రత్యేక ఎస్కలేటర్

ఉచిత ప్రసాదం, అన్నదానం..

ఆలయంలో తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకూ భక్తులకు ఉచిత ప్రసాదంగా పులిహోర, కట్టె పొంగలి, దద్దోజనం, సాంబారు అన్నం అందిస్తారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు కొండ దిగువన ఏర్పాటు చేసిన శిబిరంలో అమ్మవారి అన్నప్రసాదం అందుబాటులో ఉంటుంది.

తాత్కాలిక మరుగుదొడ్లు..

150 తాత్కాలిక మరుగుదొడ్లను విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. భక్తులు వేచి ఉండేందుకు సీతమ్మ వారి పాదాల వద్ద వేసిన షెడ్ వద్ద 40, బస్టాండ్, రాజీవ్‌గాంధీ పార్కు, కృష్ణవేణిఘాట్, కుమ్మరిపాలెం టీటీడీ పార్కింగ్ స్థలం, కెనాల్ రోడ్డు, భవానీఘాట్లలో 10 చొప్పున మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

ప్రతిరోజూ నగరోత్సవం..



ప్రతిరోజు సాయంత్రం 4గంటలకు నగరోత్సవం కనులపండువగా నిర్వహిస్తారు. మహామండపం నుంచి బయలుదేరి కనకదుర్గానగర్, రథం సెంటర్, వినాయకగుడి వరకూ వెళ్లి.. యూటర్న్ తీసుకుని కెనాల్ రోడ్డు మీదుగా ఆలయ ఘాట్‌రోడ్డు మీద నుంచి ఆలయంలోకి ప్రవేశిస్తుంది.



ఆలయ పరిసరాలు ముస్తాబు

ఘాట్లలో జల్లు స్నానాలకు ఏర్పాట్లు..

భవానీఘాట్, సీతమ్మవారి పాదాలు, పున్నమి ఘాట్లలో 700 షవర్లను ఏర్పాటు చేశారు. వీటిలో సీతమ్మవారి పాదాల ఘాట్ వద్దే 500 షవర్లు ఉన్నాయి. భక్తులు వీటి కింద నిలబడి జల్లు స్నానాలు చేసుకునేలా సౌకర్యాలు కల్పించారు. కొండ దిగువన దుర్గాఘాట్‌లో భక్తుల స్నానాలకు అనుమతి లేదు. ఇక్కడ నదీ హారతి కార్యక్రమాన్ని ప్రతిరోజు సాయంత్రం వేళ నిర్వహించనున్నారు.

భద్రతా వలయం....

దుర్గగుడి, ఘాట్లు, విజయవాడ సహా చుట్టుపక్కల మూడు షిఫ్టుల్లో 5,200 మంది పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొంటున్నారు. ఆలయంలో ఉన్న 200 సీసీ కెమెరాలతో ఉత్సవాలను డేగ కళ్లతో పర్యవేక్షించనున్నారు. ఇవికాక అదనంగా మరికొన్ని కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టరేట్, పోలీసు కమిషనర్ కార్యాలయం, కమాండ్ కంట్రోల్ రూమ్‌ల వద్ద మానిటర్లను ఏర్పాటు చేసి 24 గంటలూ పర్యవేక్షించేలా సిబ్బందిని ఏర్పాటు చేశారు.



రాజగోపురం వద్ద పోలీసులు

కేశఖండనశాల...

సీతమ్మవారి పాదాల వద్ద కేశఖండనశాలను ఏర్పాటు చేశారు. ఒక్కో షిఫ్టుకు 200 మంది చొప్పున.. మొత్తం మూడు షిఫ్టుల్లో 600 మంది క్షురకులు అందుబాటులో ఉంటారు. భవానీ, పున్నమిఘాట్ల వద్ద కూడా 25మంది చొప్పున బార్బర్లను ఉంచుతున్నారు. హైదరాబాద్ వైపు నుంచి వచ్చే భక్తులు అక్కడే తలనీలాలు సమర్పించి.. ఘాట్‌లో స్నానం చేసి అమ్మవారి దర్శనానికి రావొచ్చు.



దసరా మహోత్సవాలను పురస్కరించుకొని నగర పోలీసుల తరఫున సీపీ రాజశేఖర్ బాబు దంపతులు.. దుర్గమ్మకు తొలి సారెను బుధవారం సంప్రదాయ పద్ధతిలో సమర్పించారు.

బందరుకు పూర్వ వైభవం తెస్తా

స్వచ్ఛతాహీ సేవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ



బందరు పోర్టు పనులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు. పక్కన ఎంపీ బాలశౌరి




చీపురుపట్టి వ్యర్థాలను శుభ్రం చేస్తున్న ముఖ్యమంత్రి. పక్కన మంత్రులు నారాయణ, కొల్లు రవీంద్ర

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: బందరుకు పూర్వ వైభవం తీసుకొస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం మచిలీపట్నంలోని తితిదే కల్యాణ మండపంలో నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన బందరు చరిత్ర, స్వాతంత్ర్యోద్యమంలో ఇక్కడి నుంచి కీలకంగా వ్యవహరించిన ఉద్యమకారుల గురించి వివరించారు.

ఆంధ్ర జాతీయ కళాశాలకు మహర్దశ

'గాంధీజీ పర్యటించిన ఆంధ్ర జాతీయ కళాశాల వైకాపా ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో వెలవెలబోతోంది. కళాశాల భూములను కూడా కబ్జా చేసేందుకు కొందరు అక్రమార్కులు ప్రయత్నిస్తున్నారు. కళాశాల అభివృద్ధి బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది. ఉద్యమకారులను దేశానికి అందించిన కళాశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. దేవాదాయశాఖ పరిధిలోని కళాశాలను తీసుకుని వసతు కల్పిస్తా'మన్నారు.



స్వచ్ఛ చల్లపల్లి రథసారథి డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్‌ను సన్మానించిన సీఎం చంద్రబాబు

బందరుకు సీఎం వరాల జల్లు

'మంగినపూడి బీచ్‌ని పర్యాటకంగా అన్ని వసతులతో అభివృద్ధి చేస్తాం. నగరంలో ప్రధానమైన డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరిస్తాం. ఐవీఆర్ఎస్ ద్వారా నగరంలోని కొందరికి ఫోన్‌లు చేసి సమస్యలపై ఆరా తీయగా ఎక్కువ శాతం డ్రెయినేజీ, రహదారుల సమస్యలు చెప్పారని' సీఎం పేర్కొన్నారు. డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి ఇప్పటికే కార్యాచరణ చేపట్టామని, భౌగోళికంగా నగరం పల్లంగా ఉండంతో అవసరమైతే ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసి నగరంలో నీరు నిలవకుండా చూస్తామన్నారు. రహదారులను అభివృద్ధి చేస్తామని, మత్స్యకారులకు ఉపాధి, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తున్నామన్నారు.

రోల్డ్‌గోల్డ్ పరిశ్రమ అభివృద్ధి

'బందరు రోల్డ్‌గోల్డ్ పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, కావాల్సిన నిధులను మంత్రి రవీంద్ర నా దృష్టికి తెచ్చారు. ఈ మేరకు చర్యలు తీసుకుంటాం. చిలకలపూడి రోల్డ్‌గోల్డ్ నగలకు ఆన్‌లైన్ మార్కెటింగ్ కల్పించి అంతర్జాతీయ స్థాయిలో విక్రయాలు జరిగేలా చూస్తాం. కలంకారీ పరిశ్రమను కూడా అభివృద్ధి చేసి ఆన్‌లైన్ విక్రయాలు జరిగేలా చూస్తాం. జలజీవన్ మిషన్‌తో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇస్తా'మన్నారు.

వైకాపా కార్యాలయ భవనంపై నివేదిక

నగరం నడిబొడ్డున రెండెకరాల ప్రభుత్వ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా వైకాపా కార్యాలయ భవన నిర్మాణానికి అనుమతులు తదితరాలపై నివేదిక తీసుకుని తగు చర్యలు తీసుకుంటామన్నారు. భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారకభవన నిర్మాణ అంశాన్ని కూడా పరిశీలిస్తామని సీఎం పేర్కొన్నారు.

తెదేపా హయాంలో ప్రగతి

కొల్లు రవీంద్ర, మంత్రి

బందరులో ఏదైనా అభివృద్ధి జరిగిందంటే అది తెదేపా హయాంలోనే.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నగరంలో తెదేపా హయాంలోనే రిజర్వాయర్ల నిర్మాణం జరిగింది. 2014లో అధికారంలోకి వచ్చిన తరువాత 8 రిజర్వాయర్లు, పైపు లైన్ నిర్మాణం తదితర పనులు చేపట్టాం. ప్రస్తుతం బందరు మండలంలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి ఇచ్చేందుకు రూ.220కోట్లు సిద్ధంగా ఉన్నాయి. త్వరిత గతిన పనుల పూర్తికి కృషి చేస్తున్నాం.



బందరు వైద్య కళాశాలకు పింగళి వెంకయ్య పేరు

ఫలించిన ఎంపీ బాలశౌరి కృషి

దేశానికి మువ్వన్నెల జెండాను అందించిన పింగళి వెంకయ్య పేరు మచిలీపట్నంలో ఇక చిరస్థాయిలో నిలిచిపోనుంది. మచిలీపట్నానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు పింగళి పేరును మచిలీపట్నం వైద్య కళాశాలకు పెడతామని సీఎం చంద్రబాబు ప్రకటించడంతో.. మహనీయునికి ఘన నివాళి అర్పించినట్లయింది. ఎంపీ వల్లభనేని బాలశౌరి కృషి ఎట్టకేలకు ఫలించింది. వైద్య కళాశాలకు నిధులు కేటాయించినప్పటి నుంచి.. పింగళి వెంకయ్య పేరు పెట్టాలని బాలశౌరి విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వానికి విన్నవిస్తూనే ఉన్నారు. తాజాగా ముఖ్యమంత్రి స్వయంగా పింగళి పేరు ప్రకటించడంతో బందరులో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. దేశ స్వాతంత్ర్యోద్యమంలో పింగళి పోరాటం మరువలేనిది. కృష్ణా జిల్లాలో పుట్టి.. దేశానికి మువ్వన్నెల పతాకాన్ని రూపొందించి ఇచ్చి.. జాతిపిత గాంధీజీ మెప్పు పొందిన పింగళి పేరును వైద్య కళాశాలకు పెట్టడం శుభ పరిణామం.

అభినందనీయం: ఎంపీ బాలశౌరి



బందరు ప్రభుత్వ వైద్య కళాశాలకు పింగళి వెంకయ్య పేరు పెడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం అభినందనీయం. వైద్య కళాశాల నిర్మాణం వేళనే ఆయన పేరు పెట్టాలని కోరగా అప్పటి ఎమ్మెల్యే అహంకారంతో సాధ్యపడలేదు. కూటమి ప్రభుత్వంలో సమరయోధునికి గౌరవం దక్కనుంది. పింగళి పేరు పెట్టాలని గతంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు లేఖ రాశా. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక చంద్రబాబు తొలిసారి బందరు పర్యటనలోనే శుభవార్త చెప్పారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. వరదల వేళ సీఎం చొరవ ఆదర్శనీయం. 15లక్షల క్యూసెక్కుల వరదవచ్చినా ఇబ్బంది లేకుండా కరకట్టలను బలోపేతం చేయాలి.

తినమరిగినోళ్లు.. వదలరంతే!

పోలవరం కట్టలపై తవ్వకాలు ✳ రెండు జేసీబీలు, టిప్పర్లు స్వాధీనం

ఈనాడు, అమరావతి

గత ప్రభుత్వంలో పోలవరం కుడి కాలువ కట్టలను దాదాపు కరిగించారు. విచ్చలవిడిగా తవ్వారు. కొంత అనుమతి తీసుకుని జలవనరుల శాఖ ఆధ్వర్యంలో తవ్వితే.. మరికొంత అనధికారికంగా మాయం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారినా.. తవ్వకాలు మాత్రం ఆగడం లేదు. ఎలాంటి అనుమతులు లేకుండా కొద్దోగొప్పో ఉన్న కట్టలను తవ్వేస్తున్నారు. తమకు ఎమ్మెల్యే చెప్పారని.. అధికారులను సైతం బుకాయిస్తున్నారు. విచిత్రం ఏంటంటే.. గత ప్రభుత్వంలో తవ్విన నేతలే.. ప్రస్తుత ప్రభుత్వంలోనూ తవ్వేస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. ఎలాంటి సీనరేజీలు లేకుండా మట్టిని తరలిస్తున్నారు. మౌఖిక ఆదేశాలు ఉన్నాయని క్షేత్రాకి వెళ్లిన అధికారులను బుకాయిస్తున్నారు.



పాతపాడు వద్ద పోలవరం కట్ట తవ్వకాలు

గండ్లు పూడ్చే పేరుతో..!

ఇటీవల వరదలకు పలు చోట్ల గండ్లు పడ్డాయి. దారులకు గండ్లు పడగా.. కొన్ని అధికారులే నీరు ప్రవహించేందుకు వీలుగా గండ్లు కొట్టారు. ఇలా పడిన గండ్లు పూడ్చేందుకు మట్టి పెద్దఎత్తున అవసరం. ఈ గండ్లు పూడ్చేందుకు దగ్గరలో పోలవరం కట్టల నుంచి తవ్వాలని తమకు ఆదేశాలు ఉన్నాయని కొందరు విచ్చలవిడిగా తవ్వేసి తరలిస్తున్నారు. ప్రైవేటు వెంచర్లకు విక్రయిస్తున్నారు. వాస్తవానికి గండ్లు పూడ్చేందుకు తాము ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని అధికారులు చెబుతున్నారు. పోలవరం కుడి కాలువ కట్టపై పాతపాడు సమీపంలో రెండు జేసీబీలు పెట్టి ఓ వైకాపా నాయకుడు లారీలలో మట్టిని తరలించడంపై అధికారులకు ఫిర్యాదులు అందాయి. సోమవారం ఆ ప్రాంతంలో పలు లారీలు, ట్రాక్టర్లలో రెండు జేసీబీలు తవ్వుతున్న తీరు 'ఈనాడు'కు కనిపించింది. దీనిపై కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే చాలా వరకు తవ్వకాలు జరిపారు. దీనిపై ప్రశ్నించిన స్థానికులతో వాగ్వాదానికి దిగారు. తమకు ఎమ్మెల్యే చెప్పారనీ.. గండ్లు పూడ్చేందుకు తీసుకెళుతున్నామని భిన్నమైన వాదనలు వినిపించారు. ఈ తవ్వకాల విషయమై మరో ఎమ్మెల్యేకు సమాచారం అందడంతో ఆయన రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. పోలవరం కట్టలతోపాటు పలు ప్రాంతాల్లోనూ ఇంకా మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. పోలవరం కట్టలపై గత ప్రభుత్వంలో జరిపిన తవ్వకాలపై విచారణ జరుగుతూనే ఉంది. గన్నవరంలో స్వయంగా జలవనరుల శాఖ అధికారులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులకే దిక్కు లేదు. నేటికీ కేసు నమోదు చేయకుండా వదిలేశారు. నాడు ప్రజాప్రతినిధులు కీలకంగా వ్యవహరించి మట్టి తవ్వకాలను ప్రోత్సహించారు.

రెండు జేసీబీలు పట్టివేత..!

ఫిర్యాదు అందిన వెంటనే విజయవాడ గ్రామీణ తహసీల్దారు సుగుణ ఆ ప్రాంతాన్ని పరిశీలించి రెండు జేసీబీలను స్వాధీనం చేసుకున్నారు. రెండు టిప్పర్లను పట్టుకున్నారు. దీనిపై ఇంకా కేసు నమోదు కాలేదు. ఓ ఎమ్మెల్యే చెప్పారని ఒక వర్గం వాదిస్తుండగా.. మరో ఎమ్మెల్యే చర్యలు తీసుకోమని ఆదేశాలు ఇచ్చారని అధికారులు చెబుతున్నారు. ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య ఈ మట్టి తవ్వకాలు వివాదంగా మారాయి. మరో కాంట్రాక్టరు ఈ పోలవరం కట్ట మట్టి తనదనీ.. తాను జలవనరుల శాఖకు దరఖాస్తు చేశానని సొమ్ములు కూడా చెల్లించానని చెబుతున్నారు.

బందోబస్తు సక్రమంగా నిర్వహించండి

దసరా విధుల పోలీస్ సిబ్బందికి సీపీ సూచన

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: విజయవాడ ఇంద్రకీలాద్రిపై ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అమ్మవారి దర్శనమయ్యేలా చూడాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు పోలీస్ సిబ్బందికి సూచించారు. నేటి నుంచి అక్టోబరు 12వ తేదీ వరకు జరిగే దసరా ఉత్సవాలకు వివిధ జిల్లాల నుంచి విధులు నిర్వహించడానికి వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి విజయవాడ ఆంధ్రా లయోల కళాశాల దేవయ్య ఆడిటోరియంలో ఆయన మార్గదర్శనం చేశారు. సీపీ మాట్లాడుతూ... ఉత్సవాలకు మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని బందోబస్తు విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. విధులు నిర్వహించే సమయంలో మీడియా, సామాజిక మాధ్యమాలు గమనిస్తుంటారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించేలా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆలయ అర్చకులు, సిబ్బంది, వీఐపీలతో వివాదాలకు తావీయకుండా సమన్వయం చేసుకోవాలని చెప్పారు. ప్రతి భక్తుడితో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ.. సక్రమంగా అమ్మవారి దర్శనం అయ్యేలా చూడాలని తెలిపారు. క్యూలైన్లలో ఇబ్బందులు ఎదురైతే వెంటనే స్పందించాలని, సమస్యలకు ఆస్కారం లేకుండా చూసుకోవాలని చెప్పారు. డీసీపీలు గౌతమిషాలి, ఉదయరాణి, ఉమామహేశ్వరరాజు, కృష్ణమూర్తి నాయుడు, ఏడీసీపీలు జి.రామకృష్ణ, ఏవీఎల్ ప్రసన్నకుమార్, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు, విధులకు వచ్చిన 6 వేల మంది పోలీసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ రాజశేఖర్‌బాబు, వేదికపై ఉన్నతాధికారులు

నిధులిస్తేనే నీళ్లు.. లేదంటే బీళ్లు!

మూలకు చేరిన ఎత్తిపోతల పథకం ☛ పని చేస్తే సుమారు 50 వేల ఎకరాలకు మేలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

వైకాపా ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యానికి గురైన వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేసి సాగునీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. గతంలో రూ.8 కోట్లతో ప్రతిపాదనలు పంపినా వైకాపా ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.15 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదనలు అందజేశారు. ఇంకా నిధులు మంజూరు కాలేదు.


వేదాద్రి-కంచల ఎత్తిపోతల పంప్‌హౌస్

మూడేళ్ల కిందట..

కృష్ణా నదిపై వేదాద్రి వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించారు. ఎన్నెస్పీ కాలువలో నీటిని ఎత్తిపోసి ఆయకట్టులో పంటలకు అందించాలి. ఇందులో 2300 హెచ్‌పీ సామర్థ్యం గల నాలుగు మోటార్లు ఉన్నాయి. మూడేళ్ల కిందట మూడు మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. వాటికి మరమ్మతులు చేయించలేదు. అప్పటి నుంచి ఎత్తిపోతల మూలకు చేరింది. నందిగామ, చందర్లపాడు మండలాల్లోని ఏటూరు, కంచల ఎన్నెస్పీ మేజరు కాలువల ద్వారా 49,743 ఎకరాలకు సాగు నీరందించాలి. ఈ ఖరీఫ్‌లో రైతులు మిర్చి, పసుపు, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేస్తున్నారు.

నిలిచిన సాగర్ నీరు

నెల కిందట ఎన్నెస్పీ కాలువలకు నీరు విడుదల చేసినా ఈ ప్రాంతానికి అరకొరగా వచ్చాయి. తెలంగాణలోని ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయరు సమీపంలో సాగర్ ఎడమ కాలువకు గండి పడింది. దీంతో సాగర్ నీరు విడుదల కావడం లేదు. ఈ పరిస్థితుల్లో వేదాద్రి ఎత్తిపోతల వినియోగంలో ఉంటే ఆయకట్టుకు సాగునీరు ఇవ్వడానికి వీలుపడేది. ప్రస్తుతం నాలుగు మోటార్లు, పంపులు కొత్తవి ఏర్పాటు చేయాలి. వాటి ఏర్పాటుకు రూ.15 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే సౌమ్య సీఎం చంద్రబాబు, నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి వినతి పత్రాలు ఇచ్చారు. నిధులు మంజూరైతే పథకం అందుబాటులోకి వస్తుంది.

ప్రతిపాదనలు పంపాం

ఎత్తిపోతలలో మోటార్లు, పంపులు, ప్యానెల్ బోర్డులు ఏర్పాటుకు రూ.15 కోట్లు మంజూరు చేయించాలని ఐడీసీ సీఈకి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే మరమ్మతులు చేయించి ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయిస్తాం. **- రత్నరాజు, ఐడీసీ డీఈఈ, జగ్గయ్యపేట**

చుక్ చుక్ బండి.. 30 ఏళ్లయిందండి

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విజయవాడ, విశాఖపట్నం మధ్య నడిచే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభమై 30 సంవత్సరాలు పూర్తవడంతో బుధవారం విజయవాడ రైల్వేస్టేషన్‌లో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ రైలు అక్టోబరు 2వ తారీఖున 1994లో ప్రారంభమైంది. మొదట రత్నగిరి హిల్స్ పేరుతో నడిచేది. 1999 నుంచి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా మారింది. 2006 నుంచి ఈ రైల్లో అత్యాధునిక సౌకర్యాలు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి. సీటీసీ ర్యాక్‌లు, పూర్తి స్టెయిల్ భద్రత, డబ్ల్యుఏపీ4 అత్యాధునిక ఇంజిన్‌తో పాటు ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రైలు వేగంతో పాటు 24 బోగీలకు పెంచారు. ఉదయం విజయవాడ నుంచి బయలుదేరి రాత్రికి తిరిగి చేరుకునే ఈ రైలుకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ప్రతి రోజూ 140శాతం ఆక్యుపెన్సీ నమోదు చేసుకుంటుంది. ఉద్యోగులు, వ్యాపారులకు ఈ రైలు ఎంతో సౌకర్యవంతంగా మారింది. వేడుకల సందర్భంగా ప్రయాణికులు, రైల్వే సిబ్బంది విజయవాడ రైల్వేస్టేషన్‌లో కేక్ కోసి సంబరాలు నిర్వహించారు.


వేడుకల్లో ప్రయాణికులు, రైల్వే సిబ్బంది

గిరిజనుల సమగ్రాభివృద్ధికి పీఎం-జుగా దోహదం

కృష్ణలంక, న్యూస్‌టుడే: గిరిజనుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ప్రధానమంత్రి గాంధీ జయంతి రోజున ప్రధాన మంత్రి జన్ జాతీయ ఉన్నత్ గ్రామ అభియాన్ (పీఎం-జుగా) పథకాన్ని ప్రారంభించినట్లు కలెక్టర్ జి.సృజన తెలిపారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పథకంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ సృజన, అధికారులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పథకం కరపత్రాలను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పదేళ్ల కిందట మహాత్ముడి జయంతి రోజున ప్రారంభమైన స్వచ్ఛభారత్ మిషన్ ప్రజా ఉద్యమంలా కొనసాగి మంచి ఫలితాలనిచ్చిందని, అదే విధంగా పీఎం-జుగా అమలవుతుందని చెప్పారు. ఇబ్రహీంపట్నం మండలం కాచవరం, దాములూరు, మూలపాడు, జూపూడి, తుమ్మలపాలెం, పెనుగంచిప్రోలు మండలం లింగంగూడెం, పెనుగంచిప్రోలు, ముచ్చింతల, అనిగండ్లపాడు, కొల్లికుళ్ల, కొనకంచి, నవాబ్‌పేట, శనగపాడు, ఎ.కొండూరు మండలం కుమ్మరికుంట్ల, జగ్గయ్యపేట మండలం బూదవాడ, జయంతిపురం, మైలవరం మండలం కనిమెర్లతండా గ్రామాల్లో పథకం అమలు కానుందని చెప్పారు. గిరిజనుల సంక్షేమానికి అవసరమైన ప్రతి అంశాన్ని ఈ పథకం స్పృశిస్తుందని తెలిపారు. ఆవాస గ్రామాల్లో హౌసింగ్, రహదారులు, మంచినీటి పథకాలు, విద్యుత్తు, సోలార్, ఆయుష్మాన్ కార్డులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రులు, సమగ్రశిక్ష, టెలికాం సేవలు, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్, వ్యవసాయం, ఆక్వాకల్చర్, పశుసంవర్ధకం, అటవీ హక్కులు, టూరిజం, పీఎంఏపీజీవై తదితర అంశాలపై దృష్టి సారించనున్నట్లు వివరించారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జె.సునీత, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీఎంహెచ్‌వో సుహాసిని, నైపుణ్యాభివృద్ధి అధికారి నరేష్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సృజన తదితరులు

వంగవీటి రాధాకు సీఎం చంద్రబాబు పరామర్శ

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి కోలుకున్న మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫోన్‌లో పరామర్శించారు. ఇటీవల స్వల్పంగా గుండెపోటుకు గురైన రాధా. . గవర్నర్‌పేటలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చేరారు. చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేశారు. బుధవారం సీఎం చంద్రబాబు ఆయనికి ఫోన్ చేసి.. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

తితిదే నిత్యాన్నదానానికి కూరగాయలు



జెండా ఊపి లారీ పంపిస్తున్న మండవ వెంకటరత్నం, శీరం రామారావు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : శ్రీవారి దర్శనం కోసం వచ్చే లక్షలాది మంది భక్తులకు ఏర్పాటు చేసే అన్న ప్రసాదంలో నగరానికి చెందిన దాతలు భాగస్వామ్యం కావడం అభినందనీయమని ఇందిరా ఫుడ్స్ అధినేత మండవ వెంకటరత్నం, శ్రీరాంటెక్ ఇంజినీర్స్ అధినేత శీరం రామారావు అన్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా తితిదే నిత్యాన్నదానానికి మండవ కుటుంబరావు ఆశీస్సులతో నగరానికి చెందిన మండవ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాతలు కంకణాల రమేష్, తుమ్మల భోగేశ్వరరావు, మండవ నాగేశ్వరరావు, లంకె ప్రసాదరావు, చలసాని వెంకటేశ్వరరావు, కాంతారావు, ప్రసాద్, ఆదిత్య, సాయి తదితరుల ఆర్థిక సాయంలో పది టన్నుల కూరగాయలు ఏర్పాటు చేశారు. వాటిని బుధవారం ఎ కన్వెన్షన్ నుంచి తిరుమలకు పంపించారు. కూరగాయల లారీకి పూజలు చేసిన అనంతరం వెంకటరత్నం, రామారావు జెండా ఊపి పంపించారు. కార్యక్రమంలో ధనేకుల సత్యనారాయణ, శ్రీహరిరావు, చలపతిరావు, గుమ్మడి సురేష్, చంటి, నాగేంద్ర, బ్రహ్మాజీ, గద్దె జయరాం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి రూ.13 లక్షల వితరణ

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : అమెరికాకు చెందిన ఆశా జ్యోతి సంస్థ.. వాంబేకాలనీలోని మానవతో భవ వృద్ధాశ్రమానికి రూ.13 లక్షల చెక్కును వితరణగా ఇచ్చింది. ఆశ్రమ నిర్వహణ నిమిత్తం.. తుమ్మలపల్లి రాజేశ్వరరావు, భాగ్యలక్ష్మి, వంశీకృష్ణ వారి మిత్ర బృందం ఈ సాయం అందించింది. ఈ చెక్కును బుధవారం ఆశ్రమ నిర్వాహకులకు ఎం.రామకృష్ణ, ఎం.గోపీకృష్ణల చేతుల మీదుగా అందజేశారు.



రూ.13లక్షల చెక్కుతో ఆశాజ్యోతి మిత్ర బృందం

నగరంలో కుండపోత..!

రహదారులు జలమయం

సీతారాంపురం, న్యూస్‌టుడే : నగరంలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం పడింది. ప్రధాన రోడ్లు జలమయమయ్యాయి. వేముల శ్యామలాదేవి రోడ్డు, ఏలూరు రోడ్డు, సీతారాంపురం కూడలి, మాచవరం డౌన్‌లోని రెవెన్యూ కాలనీ ప్రాంతాలు వర్షపు నీటితో మునిగిపోయాయి. సుమారు మూడు గంటలకు పైగా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది.


సీతారాంపురం కూడలిలో..



వేముల శ్యామలాదేవి రోడ్డులో వాన నీరు

తుదిదశకు ఇంజినీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియ

కానూరు, తాడిగడప, న్యూస్‌టుడే

ఉమ్మడి కృష్ణాజిల్లాలో సాంకేతిక విద్యా శాఖ కౌన్సెలింగ్ అనంతరం 2024 సంవత్సరానికి సీట్ల కేటాయింపు కార్యక్రమం సెప్టెంబరు చివరికి పూర్తయింది. జులై నుంచి సుదీర్ఘ కౌన్సెలింగ్‌లు(మొత్తం మూడు జరిగాయి). అనంతరం స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతోంది. ఈ నేపథ్యంలో పలువురు విద్యార్థులు ఇప్పటికే ప్రవేశాలు పొందారు. కన్వీనర్ కోటాలో 78.2శాతం, మేనేజ్‌మెంటు కోటాలో 82 శాతం సీట్లు నిండాయి.

ఫీజులు పెరిగాయి.. జిల్లాలోని ఇంజినీరింగ్ కళాశాలలో కన్వీనర్ కోటాకు గతంలో కనిష్ఠంగా రూ.35,000, గరిష్ఠంగా రూ.70,000 ఉండేది. ఈ సంవత్సరం ఫీజులు కనిష్ఠంగా రూ.40వేలు, గరిష్ఠంగా రూ.1,05,000 పెంచారు. అలానే మేనేజ్‌మెంటు కోటా సీట్లకు డిమాండ్‌ను బట్టి ఏటా రూ.లక్ష నుంచి 2 లక్షలు వరకు ఫీజును నిర్ణయించారు.



ఇంజినీరింగ్ కళాశాలలు	- 28
విశ్వవిద్యాలయాలు	- 2
అందుబాటులో ఉన్న కన్వీనర్ కోటా సీట్లు	- 14,670
ఇప్పటికి పూర్తయిన సీట్లు	- 11,481 (78.2%)
మిగిలిన సీట్లు (కన్వీనర్ కోటా)	- 3,189
మేనేజ్‌మెంటు కోటా సీట్లు	- 6,330
పూర్తయినవి	- 5,190 (82%)

బ్రాంచీల వారీగా నిండిన సీట్ల శాతం

బ్రాంచి	శాతం
సీఎస్ఈ, అనుబంధంగా ఉన్నవి	95
ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ	98
ఈసీఈ	84
ఈఈఈ	72
సివిల్	59
మెకానికల్	49

ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం సీట్లు (కన్వీనర్, మేనేజ్‌మెంటు కలిపి)- 21,000

చిన్నారి మృతదేహం లభ్యం

పటమట, న్యూస్‌టుడే: విజయవాడ స్క్యూబ్రిడ్జ్ సమీపంలో తల్లి.. తన ఇద్దరు బిడ్డలతో కలిసి బందరు కాలువలో ఆదివారం దూకిన ఘటనలో చిన్నారి జాస్వి (18 నెలలు) మృతదేహం బుధవారం చోడవరం వద్ద లభ్యమైంది. నాలుగు రోజుల పాటు మృతదేహం నీళ్లలో ఉండటంతో ఉబ్బిపోయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం లభ్యమైన తల్లి తిరుపతి సుధారాణి మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మరో చిన్నారి మృతదేహం ఆదివారం నాడే దొరికిన సంగతి తెలిసిందే. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పవన్ కిషోర్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో1కి రూ.లలో)

వెంకాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, 132, 143 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 535 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

కేసులు రాజీ చేసుకుందామని పిలిచి అసభ్య ప్రవర్తన

ప్రభుత్వాసుపత్రి ఉద్యోగిపై పోలీసులకు ఫిర్యాదు

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : పాత కేసులు రాజీ చేసుకుందామని, ఇంటికి పిలిచి ఇద్దరు మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన ప్రభుత్వ ఉద్యోగిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు అందింది. ప్రత్యక్ష సాక్షులు, బాధితురాలు చెప్పిన వివరాల మేరకు. . విద్యాధరపురానికి చెందిన ఓ మహిళ (51) పండ్ల వ్యాపారం చేస్తుంటారు. ఆమెకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో వన్‌టౌన్‌కు చెందిన మరో మహిళ (32)తో కలిసి పది రోజుల క్రితం కొత్త ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. తిరిగి వస్తుండగా ప్రభుత్వాసుపత్రిలో పనిచేసే హోచిమెన్ ఎదురు పడ్డాడు. తనపై గతంలో పెట్టిన కేసులను రాజీ చేసుకుందామని కోరాడు. ఆ ఇద్దరు మహిళలు బుధవారం అజిత్‌సింగ్‌నగర్ గంగానమ్మగుడి సమీపంలోని హోచిమెన్ ఇంటికి వెళ్లారు. అతడు.. వాళ్లిద్దరి చేతులు పట్టుకుని ఇంట్లోకి లాగాడు. దూషిస్తూ.. దుర్భాషలాడడంతో వారు భయపడిపోయారు. కేకలు వేస్తూ.. అతడికి దేహశుద్ధి చేశారు. ఇంతలో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకోవడంతో.. బాధితులు వెళ్లిపోయి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై రాజీ చేసేందుకు కొంత మంది వైకాపా నాయకులు ప్రయత్నిస్తున్నారు.

పాత కేసుల వివరాలు ఇవే...

విద్యాధరపురానికి చెందిన మహిళ (51).. 2020, ఆగస్టు 19న పాత ప్రభుత్వాసుపత్రి గేటు వద్ద తన సోదరి నిర్వహించే హోటల్‌కు వెళ్లారు. పాత ప్రభుత్వాసుపత్రిలో పనిచేసే హోచిమెన్ వచ్చి ఆమెను దుర్భాషలాడి, బెదిరించాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గవర్నర్‌పేట పోలీసులు 179/2020గా కేసు నమోదు చేశారు. వన్‌టౌన్‌కు చెందిన (32).. పాత ప్రభుత్వాసుపత్రిలో క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. హోచిమెన్ 2020 సంవత్సరం నుంచి ఆమెను వేధిస్తున్నాడు. 2021, ఫిబ్రవరి 12న వాష్‌రూమ్‌కు వెళుతుండగా ఆమె వెంటపడి అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గవర్నర్‌పేట పోలీసులు 48/2021గా కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసులను రాజీ చేసుకుందామని ఇంటికి పిలిచిన హోచిమెన్.. మహిళలతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితులు మరోసారి అతడిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నూతన మద్యం విధానం సవరించాలి

లెనిన్ కూడలిలో నిరసన దీక్ష

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అక్టోబరు నుంచి తెచ్చిన నూతన మద్యం విధానాన్ని సవరించాలని మహిళా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. మద్యం విక్రయించే సమయాన్ని, దుకాణాలను కుదించాలని కోరుతూ బుధవారం లెనిన్‌కూడలిలో నిరసన దీక్ష చేపట్టారు. రైతు నాయకుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా, ప్రజలను మద్యం మత్తులో ముంచేలా నూతన పాలసీని గాంధీ జయంతి రోజు నుంచే అమలు చేయడం సిగ్గుచేటన్నారు. మద్యానికి బానిసలైన వారి జీవితాలు నాశనం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ నాయకురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో మద్యం ప్రధాన ఆదాయ వనరుగా మారిందని పేర్కొన్నారు. మహిళలు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. వైకాపా హయాంలో ప్రభుత్వ నియంత్రణలో ఉన్న మద్యం.. నేడు ప్రైవేటు వ్యక్తులు, సిండికేట్ చేతుల్లోకి వెళ్లిందని ఆరోపించారు. భారత జాతీయ మహిళా సమాఖ్య, ఐద్వా, ప్రగతిశీల మహిళా సంఘం, మహిళా కాంగ్రెస్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. విశాఖ ఉక్కు ప్రైవేటుపరం కాకుండా ప్రజలు పోరాటం చేస్తుంటే కూటమి ప్రభుత్వం.. దాన్ని పక్కదారి పట్టిస్తోందని విమర్శించారు. సనాతన ధర్మం పేరుతో మత, భక్తి విశ్వాసాలను రెచ్చగొట్టడం తగదన్నారు. తిరుమల లడ్డూ కల్తీ ఘటనను రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు. సోషలిస్ట్ నాయకుడు వి.వి.కృష్ణారావు మాట్లాడుతూ.. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుంకర పద్మశ్రీ, డి.రమాదేవి, పెన్మత్స దుర్గాభవానీ, పి.పద్మ తదితరులు పాల్గొన్నారు.


మహాత్మాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శోభనాద్రీశ్వరరావు, భాగ్యలక్ష్మి, దుర్గాభవానీ, పద్మశ్రీ, రమాదేవి తదితరులు

కర్మాగారంలో కార్మికులకు గాయాలు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట పట్టణానికి చేరువలోని ఆటోనగర్‌లో ఉన్న రసాయన కర్మాగారంలో పని చేసిన ఇద్దరు కార్మికుల శరీరంపై తీవ్ర గాయాలై జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాలుగు రోజుల క్రితం మల్కాపురం గ్రామానికి చెందిన మడుపల్లి వేణు, వడ్డెబోయిన గోపి రోజువారీ కూలీలుగా రసాయన కర్మాగారానికి వెళ్లారు. కనీస రక్షణ చర్యలు లేకుండా వారితో రసాయన బస్తాలు, ఐస్‌బాక్స్‌లను పైఅంతస్తుకు మోయించారు. పని ముగించుకొని ఇంటికి వెళ్లిన వారి శరీరంపై దురద, మంటలు రావడంతో స్థానిక ఆర్‌ఎంపీ వద్ద వైద్యం చేయించుకున్నారు. మూడు రోజులైనా తగ్గకపోగా.. చేతిపై బొబ్బలు రావడంతో బుధవారం జగ్గయ్యపేటలోని ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసిన సీపీఎం, సీఐటీయూ నాయకులు ఆసుపత్రిలో వారిని పరామర్శించి పరిస్థితిని సమీక్షించారు. విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలని తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు. కర్మాగారం వారు బాధితులకు మెరుగైన వైద్యం చేయించాలని, వారు కోలుకునే వరకు వారి కుటుంబాలకు అవసరమైన జీవనోపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు సోమోజు నాగమణి, రావెళ్ల శేషు, షేక్ గౌసమియా, ఎస్.రామనాథం తదితరులు పాల్గొన్నారు.


క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు | కార్మికుడి చేతిపై బొబ్బలు

? స్థానిక వంతెన సమీపంలో మైలవరం వైపు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో గుంత ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

– పి.విజయ్, గ్రామస్థుడు

✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందిని పంపి మరమ్మతులు చేయిస్తాం.

– హేమంత్‌కుమార్ ఆర్‌అండ్‌బీ సహాయక ఇంజినీర్

– న్యూస్‌టుడే, జి.కొండూరు

నేటి నుంచి ఆలయాల్లో శరన్నవరాత్రులు

కొండపల్లి: కొండపల్లి మార్కెట్ సెంటర్, చెన్నకేశవ రామాలయం, దిగువ బజార్ మాంసం కొట్ల కూడలి, తూర్పు ఇబ్రహీంపట్నం రామాలయం, శక్తినగర్‌లలో గురువారం నుంచి శరన్నవరాత్రులను నిర్వహించనున్నట్లు ఆయా ఉత్సవ కమిటీలు తెలిపాయి. విజయవాడ కనకదుర్గ ఆలయం నియమాల మేరకు అమ్మవారి అవతారాలకు అనుగుణంగా స్థానికంగా అలంకరణలు చేస్తామని పేర్కొన్నారు. 17న ఊరేగింపు, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

అలరించిన అమ్మవారి వేషధారణలు



మైలవరం, న్యూస్‌టుడే: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక వివేకానంద పాఠశాలలో చిన్నారులు అమ్మవారికి 9 రోజుల పాటు అలంకరించే వేషధారణలు ధరించి అలరించారు. ప్రిన్సిపల్ ఎం.వి.శ్రీనివాసరావు, కరస్పాండెంట్ పి.రాజారెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులకు దసరా పండగ విశిష్టతను వివరించారు.

స్వచ్ఛంద సంస్థల సాయం అభినందనీయం



వరద బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్, వీఆర్‌కే నగర మహిళలు

కొండపల్లి, న్యూస్‌టుడే: వరద నీటిలో రాత్రంతా గడిపిన సంఘటన ఇందిరమ్మ కాలనీ వాసుల కళ్లల్లో ఇంకా కనిపిస్తూనే ఉందని ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ వీఆర్‌కే నగర మహిళ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కాలనీ వాసులకు నిత్యావసరాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల ఒకటిన ఈ ప్రాంతమంతా నీటి మునిగి కాలనీ వాసులు తీవ ఇబ్బందులకు గురయ్యారన్నారు. దాదాపు నాలుగు రోజులు పునరావాస కేంద్రంలో తలదాచుకున్న సంఘటనలు కళ్ల ముందు కనిపిస్తున్నాయన్నారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు బాధితులకు ఈ రకంగా సాయమందించడం ఆహ్వానించదగ్గ విషయమని కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

అర్హు లందరికీ సాయం అందిస్తాం

గొల్లపూడి, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి ఒక్కరికీ వరద సాయాన్ని అందిస్తామని.. ఆపరేషన్ బుడమేరు పేరుతో ఆధునికీరణ చేపట్టేందుకు, భవిష్యత్తులో వరదలు రాకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం రాయనపాడులో నిర్వహించిన సబ్‌కీ యోజనా.. సబ్‌కా వికాస్ కార్యక్రమంలో రైతులు, వరద బాధితులు వాళ్ల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు వల్లే వరద విపత్తు నుంచి త్వరగా విముక్తి లభించిందన్నారు. బుడమేరు వరద కారణంగా మైలవరం నియోజకవర్గంలోని ప్రజలు ఎక్కువగా నష్టపోయారన్నారు. కొందరు అధికారుల తప్పిదం వల్లే రాయనపాడు, పైడూరుపాడు గ్రామాల వారికి వరద విపత్తు సాయం అందడంలో కొంత అన్యాయం జరిగిందన్నారు. గ్రామ సర్పంచి కాటంనేని కల్యాణి, నాయకులు అక్కల గాంధీ, శీలంనేని సాంబశివరావు, పూర్ణచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

గండం గడిస్తేనే.. బండ్లు కదిలేది..!

అధ్వానంగా మారిన రోడ్లతో ప్రయాణికుల అవస్థలు

గంపలగూడెం, న్యూస్‌టుడే



చింతలనర్వ సమీపంలో పడిన గండి



మెట్టగుట్ట దారిలో తారు రోడ్డు ఇలా..

వరదలతో రహదారులకు పడిన గండ్లు ప్రయాణికులకు ప్రాణాపాయంగా మారాయి. గండ్లు పడి నెల రోజులైనా వాటిని పూడ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టలేదు. దీంతో వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. సెప్టెంబరు మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు నాలుగైదు రోజులపాటు ఆర్‌అండ్‌బీ రహదారులపై వరద నీరు ఉద్ధృతంగా ప్రవహించడంతో రహదారులు ధ్వంసమయ్యాయి. ఆర్టీసీ బస్సులు, లారీలు, కార్లు, ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు గండ్లు పడిన ప్రదేశాల్లో ప్రయాణం ప్రమాదకరమని తెలిసినా ప్రత్యామ్నాయ మార్గాలు లేక అటుగానే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది.

ఈ మార్గాల్లో జాగ్రత్త

✷ కొణిజెర్ల వెలుపల ఆర్‌అండ్‌బీ రోడ్డుకు పడిన గండి ప్రమాదకరంగా ఉంది. సింగిల్ రోడ్డు కావడంతో ఎదురెదురు వాహనాలు బోల్తాపడే ప్రమాదం ఉందని స్థానికులు కర్రలకు ఎరుపు రంగు వస్త్రాలు కట్టారు. అటుగానే నెమలి వేణుగోపాలస్వామి గుడికి భక్తులు రాకపోకలు సాగించాల్సి ఉంది. ✷ పెనుగొలను నుంచి మెట్టగుట్ట వెళ్లే దారిలో తారు రోడ్డుకు పడిన గండి మరింత దారుణంగా మారింది. అటుగా భక్తులు శేషాచల శ్రీనివాసస్వామి ఆలయానికి రాకపోకలు సాగిస్తారు. భారీ వాహనాలు కూడా వస్తుంటాయి. ఎర్రుపాలెం మండలానికి వయా గోసవీడు మీదుగా వెళ్లేందుకు ప్రయాణికులు సైతం వెళ్తుంటారు. సిమెంట్ పైపులు బయటకు కనిపిస్తూ ప్రమాదకరంగా ఉంది. ✷ మేడూరు నుంచి సొబ్బాల వెళ్లే తారు రోడ్డు కూడా ఏడాది కిందట నిర్మించారు. ఇటీవల వరదలకు సొబ్బాల చెరువు వాగు వద్ద తారు రోడ్డు అంచు రెండు నుంచి నాలుగు అడుగుల మేరకు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళ వాహనదారులు అజాగ్రత్తగా ఉంటే ప్రమాదం తప్పదు. ✷ చింతలనర్వ నుంచి చల్లగుండ్లవారిపాలెం వెళ్లే దారిలో చెరువుకు సమీపంలో భారీ గండిపడింది. ద్విచక్ర వాహనాలు, పాదచారులు కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. ఆ దారిలోనే గ్రామస్థులు రాకపోకలు సాగిస్తారు. ✷ గాదెవారిగూడెం- ఊటుకూరు రహదారిపై అడుగుకో గుంత ఉంది. వరదలకు తారు కొట్టుకుపోయి కంకర రాళ్లు బయటపడ్డాయి. ఆ రోడ్డులో ప్రయాణించడంతో ఒళ్లు గుల్ల అవుతోందని ప్రజలు వాపోతున్నారు.

రెండు రోజుల్లో పూడ్చిస్తాం

వినగడప, కొత్తపల్లి, పెనుగొలను సమీపంలో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారుల వెంట వరదలకు పడిన గండ్లను వెంటనే పూడ్చించాం. ఊటుకూరు-గాదెవారిగూడెం రహదారికి వారంలో అతుకుల పనులు చేయిస్తాం. చింతలనర్వ, మెట్టగుట్ట, కొణిజెర్ల గ్రామాల పరిధిలోని గండ్లు కూడా రెండు రోజుల్లో పూడ్చిస్తాం.

– అచ్చారావు, ఆర్‌అండ్‌బీ ఏఈ, గంపలగూడెం

ఉపాధి హామీ పథకం పనులపై అవగాహన

గంపలగూడెం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ సభలను అధికారులు గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లో బుధవారం నిర్వహించారు. ఉపాధి పనులు, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న సిబ్బందిని సత్కరించారు. ఎన్ఆర్ఈజీఎస్ పనుల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామసభలో తెదేపా మండలాధ్యక్షుడు జి.కృష్ణారెడ్డి, గంపలగూడెం మండలం గోసవీడు సభలో తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి కె.రజనీకాంత్ పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.



గోసవీడులో సిబ్బందిని సత్కరించిన అధికారులు, నాయకులు



కార్మికురాలు భారతిని సత్కరిస్తున్న కమిషనర్ లోవరాజు, సిబ్బంది

ఉత్తమ పారిశుద్ధ్య కార్మికురాలికి సన్మానం

తిరువూరు, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా మాసోత్సవాలు సందర్భంగా తిరువూరు నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉత్తమ పారిశుద్ధ్య కార్మికురాలిగా ఎంపికైన మోదుగు భారతిని కమిషనర్ జి.లోవరాజు ఆధ్వర్యంలో సన్మానించారు. పట్టణంలో పారిశుద్ధ్య పనుల్లో ఆమె నిబద్ధతతో బాధ్యతలు నిర్వహించారని ఆయన ప్రశంసించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అన్న క్యాంటీన్ వద్ద సింహాచలం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పలువురు వార్డు కౌన్సిలర్లు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌కు సహకరించాలి

గుంటుపల్లి (ఇబ్రహీంపట్నం(గ్రామీణం), న్యూస్‌టుడే: సామూహిక పరిశుభ్రత కలిగి స్వచ్ఛ భారత్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను సంస్థలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా కేంద్రం స్వచ్ఛత కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిందన్నారు. కార్మికులు, ఉద్యోగులు సామూహిక పరిశుభ్రత, మొక్కలు పెంచడం వంటి కార్యక్రమాలు విస్తృతంగా చేయాలన్నారు.



మాట్లాడుతున్న వర్క్‌షాపు మేనేజర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎం.నాగేశ్వరరెడ్డి

సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: గ్రామాలే దేశానికి పట్టు కొమ్మలని.. సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తోందని తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం రెడ్డిగూడెం మండల పరిషత్తు కార్యాలయంలో ఉపాధి హామీ పనులు గుర్తించి గ్రామసభ ద్వారా ఆమోదించడానికి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేసుకునే బాధ్యత ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచి ఎం.రాణి, ఉప సర్పంచి కె.వెంకటేశ్వరరావు(బాబు), తెదేపా నాయకుడు ఆర్.వీరాస్వామి నాయుడు, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమా తదితరులు



ఎ.కొండూరు : పోలిశెట్టిపాడులో..



తిరువూరు : బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో..



గొల్లపూడిలో నివాళులర్పిస్తున్న శాసనసభ్యుడు కృష్ణప్రసాద్, నాయకులు

బాపూజీ బాటలో నడవాలి

న్యూస్‌టుడే బృందం : మహాత్మాగాంధీ లాంటి దేశభక్తి, నిజాయితీ, సేవా భావం కలిగిన మహనీయుడిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం గాంధీజీ జయంతిని పురస్కరించుకొని పలు కూడళ్ళు, ప్రభుత్వ కార్యాలయాల్లో బాపూజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



గంపలగూడెం : తునికిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో దాతల సాయంతో గాంధీ విగ్రహావిష్కరణ



ఇబ్రహీంపట్నంలో..



మైలవరం: తెదేపా కార్యాలయంలో..




మైలవరం : బార్ కార్యాలయంలో న్యాయవాదుల నివాళి



జి.కొండూరు: వెల్లటూరులో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

జామ చెట్టుకు దోమతెర



జామ చెట్టుకు దోమతెర ఏంటా అనుకుంటున్నారా.. అవును నిజమే చెట్టుకు దోమతెర కట్టారు.. కానీ దోమల నుంచి రక్షణకు కాదు.. వానరాల నుంచి కాపాడుకోవడానికి.. మండలంలోని పెనుగొలను శివారు చల్లగుండ్లవారిపాలేనికి చెందిన రైతు ఉయ్యూరు జమలారెడ్డి తన ఇంటి పెరట్లో పెంచుకుంటున్న జామ చెట్టుకు రుచికరమైన కాయలు కాస్తున్నాయి. గమనించిన కోతులు వాటిని కొరికి ఆగం చేస్తున్నాయి. దీంతో కాయలు వానరాలకు కనపడకుండా చెట్టు మొదలు నుంచి చివరి కొమ్మల వరకు దోమ తెర చుట్టూ కట్టేశారు.

– న్యూస్‌టుడే, గంపలగూడెం

మాజీ సర్పంచుల విగ్రహాల ఆవిష్కరణ

నెమలి(గంపలగూడెం): నెమలిలో మాజీ సర్పంచులు బెల్లం కృష్ణయ్య, బెల్లం నాగేశ్వరరావు విగ్రహాలను బుధవారం రాత్రి తెదేపా, వైకాపా నాయకులు ఆవిష్కరించారు. సోదరులైన వారిద్దరు గ్రామాభివృద్ధికి చేసిన కృషి, వారి రాజకీయ జీవితం ఆదర్శనీయమని వక్తలు కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, సర్పంచిగా కృష్ణయ్య.. సర్పంచిగా, నెమలి వేణుగోపాలస్వామి గుడి ఛైర్మన్‌గా నాగేశ్వరరావు అందించిన సేవలను స్మరించుకున్నారు. తెలుగు రైతు జిల్లాధ్యక్షుడు సీహెచ్.రాజేశ్వరరావు, మాజీ ఎంపీపీ వై.పుల్లయ్యచౌదరి, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు డి.సీతారామ్‌ప్రసాద్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పి.కొండలరావు, తెదేపా మండలాధ్యక్షుడు ఆర్.వీరారెడ్డి, వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లగట్ల స్వామిదాసు, మాజీ సర్పంచి కె.వినయ్‌కుమార్, రాజవరం సొసైటీ మాజీ అధ్యక్షుడు సీహెచ్.శేషగిరిరావు, జడ్పీటీసీ కె.శామ్యూల్, ఖమ్మం జడ్పీ ఉపాధ్యక్షుడు కె.అజయ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. తెదేపా గ్రామశాఖ అధ్యక్షుడు బెల్లం మధుసూదనరావు పర్యవేక్షణలో విగ్రహాల ఆవిష్కరణ జరిగింది.

జూదరుల అరెస్టు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట శివారులో బుధవారం సాయంత్రం జూదమాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.9,080 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

దేవీ శరన్నవరాత్రోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



జగన్మాత ప్రతిమ

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలో గురువారం నుంచి ప్రారంభమయ్యే దేవీశరన్నవరాత్రోత్సవాలకు భక్తులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నెమలి, పెనుగొలను, వినగడప, ఊటుకూరు, గంపలగూడెం, మేడూరు, తోటమూల, ఆర్లపాడు, గోసవీడు తదితర గ్రామాల్లో ఉత్సవాల నిర్వహణకు జగన్మాత ప్రతిమలను భక్తులు కొనుగోలు చేశారు. ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నారు.



సిద్ధమైన మండపం



సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

పరిహారం అందజేతపై హర్షం

మైలవరం, న్యూస్‌టుడే: వరద బాధితులకు రూ.10 వేల చొప్పున పరిహారాన్ని ప్రభుత్వం సకాలంలో చెల్లించడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఎస్సీ ఏరియా కమ్యూనిటీ కేంద్రం వద్ద తెదేపా ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

‘జోగి రమేష్ బంధువులమని జేసీబీ లాక్కున్నారు’

తాడేపల్లి, న్యూస్‌టుడే: విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఉండవల్లి నివాసంలో బుధవారం నిర్వహించిన ‘ప్రజా దర్బార్’లో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన వారిని నేరుగా కలుసుకుని సమస్యలు తెలుసుకున్నారు. వారి నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి భరోసా ఇచ్చారు. తన వద్ద ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరుకు చెందిన వైకాపా నేతలు వేములకొండ తిరుపతిరావు, సాంబశివరావు జేసీబీ అద్దెకు తీసుకున్నారని, బాడుగ సొమ్ము ఎగ్గొట్టడంతోపాటు మాజీ మంత్రి జోగి రమేష్ బంధువులమంటూ జేసీబీని స్వాధీనం చేసుకున్నారని ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లికి చెందిన తలారు రంగారావు వినతి పత్రం అందజేశారు. వారి దురాగతాలు భరించలేక ప్రాణ భయంతో ఇల్లు వదిలి పారిపోయామని వివరించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు.

‘ఎమ్మెల్యే కొలికపూడిపై చర్యలు తీసుకోవాలి’

తిరువూరు: తాను ఏర్పాటు చేసుకున్న సమావేశానికి రాలేదన్న అక్కసుతో కుక్కలకు ఉన్న విశ్వాసం రైతులకు లేదని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడడం దారుణమని వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లగట్ల స్వామిదాసు మండిపడ్డారు. బుధవారం స్థానిక కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ..మహిళలు, పాత్రికేయులు, కర్షకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అతనిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విజయవాడ తూర్పు

స్పందనకు వందనం

❖ 11వ డివిజన్ ఆర్.ఆర్. గార్డెన్స్‌లో సైడు కాలువల్లో పూడిక తీయడంలేదని స్థానిక నివాసి వెంకటేశ్వరరావు శానిటరీ అధికారి రాయలు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పూడిక తీయించారు.

❖ కృష్ణలంక గౌతమినగర్ 20-100/107 విద్యుత్ స్తంభానికి ఉన్న దీపం వెలగడం లేదని కిషోర్ కుమార్ ఏఈ నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు.

? మాచవరం కోరిలో తాగునీటి పైపులు సరిగా లేక నీరంతా వృథాగా పోతోంది. సరి చేయాలి - **మురళి**

✔ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.
- నాగేశ్వరరావు, ఏఈ – న్యూస్‌టుడే, కరెన్సీనగర్

మరో హామీ అమలు

పటమట, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం విధించిన చెత్త పన్నును రద్దు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెదేపా నాయకుడు క్రాంతికుమార్ బుధవారం తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని గాంధీ జయంతి నాడు రద్దు చేశారని పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ దిశగా ముఖ్యమంత్రి ముందుకు సాగుతున్నారని వెల్లడించారు.

రసాయన రహిత ఆహారంతో ఆరోగ్యం

ఇన్వైట్ యువర్ కమిషనర్ కార్యక్రమ విజేత నాగలక్ష్మి



కమిషనర్ ధ్యానచంద్రకు పెరటిలో పండించిన ఆకుకూరలు చూపిస్తున్న మహిళలు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 'ఇన్వైట్ యువర్ కమిషనర్' కార్యక్రమ విజేతగా విజయవాడ భారతీనగర్ రెండో రోడ్డుకు చెందిన ధవళేశ్వరపు నాగలక్ష్మి నిలిచారు. ఆమె ఇంటికి బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర వెళ్లి ఆమె నిర్వహిస్తున్న టెర్రస్ గార్డెన్ చూశారు. ఆమెకు రూ.పది వేల చెక్కు అందించారు. కమిషనర్ మాట్లాడుతూ.. రసాయనాల రహిత ఆహారం తింటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. టెర్రస్ గార్డెన్, బాల్కనీ గార్డెన్, బ్యాక్ యార్డ్ గార్డెన్ నిర్వాహకులకు 'వన్ ఎర్త్ వన్ లైఫ్' సంస్థ సేంద్రియ ఎరువు అందించి కూరగాయలు, పండ్లు, పూలు పండించేందుకు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. నగర పాలక సంస్థ పాఠశాలల్లో వారానికి ఒకరోజు విద్యార్థులు ఈ విధానం గురించి తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ తరహా తోటతో ఉష్ణోగ్రత ఒక డిగ్రీ తగ్గించవచ్చని, తోచిన సమయంలో గార్డెనింగ్ చేసుకొని ఆరోగ్యంతో ఉండవచ్చని అన్నారు. ఇంట్లో కూరగాయలు పండించడం వల్ల పర్యావరణ వ్యవస్థ, జీవరాశుల జీవనం మెరుగుపడుతుందని వివరించారు. కూరగాయల వ్యర్థాలతో ఎరువు తయారు చేస్తున్న 'వన్ ఎర్త్ వన్ లైఫ్' వాలంటీర్లను కమిషనర్ అభినందించారు. అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ముఖ్య వైద్యాధికారి రత్నావళి, సహాయ వైద్యాధికారి బాబూ శ్రీనివాస్, డిప్యూటీ సిటీప్లానర్ జూబిన్ చీరన్‌రాయ్, ఎస్టేట్ అధికారి టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిఘా కొరవడి.. నేరాలు పెరిగి

పటమట, న్యూస్‌టుడే

★ మొగల్రాజపురం అశోక్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఇమ్రాన్ ఈ ఏడాది ఆగస్టు 23న తన ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని నిలిపారు. ఉదయం లేచి చూస్తే కనిపించలేదు. లబోదిబోమంటూ మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

★ కరణం గారి బజారుకు చెందిన నవీన్ గత నెల 18వ తేదీ రాత్రి తన ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశారు. ఉదయం చూస్తే కనిపించలేదు. పటమట పోలీసులకు ఫిర్యాదు అందజేశారు.

రెండు స్టేషన్ల పరిధిలో చోరీ కేసుల వివరాలు

	పటమట	మాచవరం
2021	51	43
2022	80	57
2023	75	43
2024 (సెప్టెంబర్)	60	25

భద్రత కరవు

సెంట్రల్ డివిజన్ పరిధిలో ద్విచక్ర వాహనాలకు భద్రత కరవైంది. ఆసుపత్రి ఎదుట, కల్యాణ మండపం వద్ద, చివరికి ఇంటి ముందు వాహనం నిలపాలంటే యజమానులు హడలెత్తిపోతున్నారు. దొంగలు సీసీ కెమెరాలు, జన సంచారం తక్కువగా ఉండే ప్రాంతాలను ఎంచుకొని చోరీలకు తెగబడుతున్నారు. దొంగిలించిన వాహనాల నెంబరు ప్లేట్లు మార్చేసి పోలీసులు కళ్లుగప్పి తిరుగుతున్నారు. తమ బండి పోయిందని ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించడం లేదని బాధితులు వాపోతున్నారు. కొన్నిసార్లు యాజమానులే సీసీ కెమెరా ఫుటేజీ సేకరించి పోలీసులకు ఇస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి స్టేషన్ చుట్టూ తిరిగినా ఫలితం ఉండటం లేదని అంటున్నారు.

వాహనానికి బదులు గంజాయి

స్మగ్లర్లు ఇంతకు ముందు దొంగిలించిన వాహనాలతో గంజాయి రవాణా చేసేవారు. అరకు వెళ్లి కిలో రూ.3 వేల చొప్పున తెచ్చేవారు. ఇప్పుడు సీన్ మారింది. రూపాయి ఖర్చు పెట్టకుండా గంజాయి తెస్తున్నారు. దొంగిలించిన ద్విచక్ర వాహనాలను ఏజెన్సీ ప్రాంతంలోని వ్యాపారులకు ఇచ్చి.. బదులుగా గంజాయి తీసుకొస్తున్నారు. ఒక్కో ద్విచక్ర వాహనానికి 50 కిలోల వరకు గంజాయి వస్తోంది. ఫలితంగా ద్విచక్ర వాహనాలు చోరీ జరిగితే రికవరీ కష్టమవుతోందని పోలీసులు చెబుతున్నారు.



ఇటీవల పటమట పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

నిఘా వైఫల్యం...

★ పటమట, మాచవరం స్టేషన్లకు గతంలో క్రైమ్‌కు ఎస్సైలు ఉండేవారు. చోరీ కేసులను వారు దర్యాప్తు చేసేవారు. ఎన్నికల ముందు నుంచి క్రైమ్ ఎస్సైలు లేరు. ఫలితంగా కేసుల దర్యాప్తు నత్తనడకన సాగుతోంది. ★ రెండు స్టేషన్ల పరిధి ఎక్కువ. ప్రస్తుత బ్లూకోల్ట్స్ సరిపోవడం లేదు. ★ రాత్రి గస్తీ నిర్వహణ అంతంత మాత్రమే ఉంటోంది. ★ పాత నేరస్థుల కదలికలపై నిఘా లోపించింది. ★ సీసీ కెమెరాలు పని చేయడం లేదు.

అప్రమత్తతే రక్ష

యజమానుల అప్రమత్తతే ద్విచక్ర వాహనాలకు రక్షణ. ఫోర్క్ లాక్, పెట్రోల్ లాక్, హ్యాండిల్ లాక్ వేసుకోవాలి. జీపీఎస్, యాంటి థెఫ్ట్ అలారం వంటి పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు చెబుతున్నారు.

జనసేన బలోపేతానికి కృషి చేయండి

పటమట, న్యూస్‌టుడే: విజయవాడలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నేత సామినేని ఉదయభాను పిలుపునిచ్చారు. ఉదయభాను జనసేనలోకి వచ్చిన నేపథ్యంలో బుధవారం పటమటలోని ఆయన క్యాంపు కార్యాలయంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ నాయకులు అతన్ని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో జనసేన పార్టీ రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించనుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు.

రక్షణ కల్పించాలని ప్రేమికుల విజ్ఞప్తి

విజయవాడ (గాంధీనగర్): కులాంతర వివాహం చేసుకున్న తమను ఇంట్లో వాళ్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, పోలీసులు రక్షణ కల్పించాలని పటమటకు చెందిన చిలక శ్రావణి విజ్ఞప్తి చేశారు. భర్త రామారావుతో కలిసి బుధవారం ఆమె విజయవాడ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. మూడేళ్లుగా ప్రేమించుకుంటున్న తాము.. గత నెల 10వ తేదీన శిర్డీలో వివాహం చేసుకున్నామని తెలిపారు. తన తల్లిదండ్రులు బెదిరించడంతో పటమట పోలీసులను ఆశ్రయించామని, అయినా వేధింపులు ఆపడం లేదని ఆమె వాపోయారు.

భక్తుల సేవలో తరించండి

విజయవాడ సిటీ: దుర్గగుడిలో దేవి శరన్నవరాత్రులు నిర్వహించనున్న నేపథ్యంలో జాతీయ సేవా పథకం వాలంటీర్లు అందించాల్సిన సేవలపై సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో బుధవారం అవగాహన కల్పించారు. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఓఎస్డీ వెలగా జోషి, డీసీపీ మహేశ్వరరాజు మాట్లాడుతూ.. వృద్ధులు, దివ్యాంగులను దర్శనానికి తీసుకురావడం, తాగునీరు, మజ్జిగ పంపిణీ తదితర సేవలు గురించి తెలియజేశారు. రమేష్, వినయ్ పాల్గొన్నారు.

గాంధీజీ మార్గం అనుసరణీయం



కృష్ణలంక: మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వాసవీ సేవా సంఘం సభ్యులు



పటమట: అశోక్‌నగర్‌లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరుల నివాళి



పటమట: ప్రేమధాన్ సేవాశ్రమంలో వృద్ధులకు, విద్యార్థులకు, పండ్లు, మిఠాయిల పంపిణీ



మాచవరం: జాతిపిత విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న డేవిడ్ తదితరులు



విజయవాడ సిటీ: జనశిక్షణ సంస్థాన్‌లో...

న్యూస్‌టుడే బృందం: విజయవాడ తూర్పు నియోజకవర్గంలో బుధవారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు, పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, క్లబ్‌ల నిర్వాహకులు గాంధీజీ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు. మహాత్ముడు దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. గాంధీజీ మార్గం అందరికీ అనుసరణీయమని పేర్కొన్నారు.



పటమట: సర్వోత్తమ గ్రంథాలయంలో...



ఆటోనగర్: తెదేపా జిల్లా కార్యాలయంలో..



ఆటోనగర్: గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో..



విజయవాడ సిటీ: 19వ డివిజన్ తెదేపా కార్యాలయంలో..

ప్రజల సహకారంతోనే స్వచ్ఛ భారత్



వాకథాన్‌లో అధికారులు, సిబ్బంది

లబ్బీపేట (విజయవాడ సిటీ): జాతిపిత మహాత్మాగాంధీ, ప్రధాని నరేంద్రమోదీ కోరుకున్నట్లు స్వచ్ఛభారత్‌లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి, ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి శివహర్ష అన్నారు. స్వచ్ఛత హీ సేవ పక్షోత్సవాల్లో చివరి రోజైన బుధవారం కేంద్ర ఆర్థిక, విదేశీ వ్యవహారాల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలో వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు, సామాజిక ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఫలితంగా ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. జీఎస్టీ సంయుక్త కమిషనర్ బి.లక్ష్మీనారాయణ, సహాయ కమిషనర్లు బి.రవికుమార్, వి.ఎస్.కె.రాయలు, సీతారామరాజు, సూపరింటెండెంట్లు సీహెచ్ ఈశ్వరరావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కాలుష్య రహిత సమాజానికి కృషి

విజయవాడ క్రీడలు: కాలుష్య రహిత సమాజానికి అందరూ కృషి చేయాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా బుధవారం స్థానిక ఐజీఎంసీ స్టేడియం ఈట్ స్ట్రీట్ వద్ద నిర్వహించిన సైకిల్ థాన్‌ని కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి ఆమె ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ... స్వచ్ఛత అంటే కేవలం పరిసరాల పరిశుభ్రతకు మాత్రమే పరిమితం కావడం లేదని, కాలుష్య రహిత నగరంగా విజయవాడను తీర్చిదిద్దేందుకు సైకిల్ థాన్ వంటి కార్యక్రమాలు వీఎంసీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగర ప్రజలు సెలవు దినాల్లోనైనా సైకిల్ తొక్కే అలవాటు చేసుకోవాలని సూచించారు. తద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చని అన్నారు. కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ... పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడానికి సైకిల్ థాన్ నిర్వహించినట్లు తెలిపారు. అదనపు కమిషనర్ (పి) చంద్రశేఖర్, చీఫ్ మెడికల్ హెల్త్ అధికారి పి.రత్నావళి, డిప్యూటీ సిటీప్లానర్ జుబిన్ చీరన్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు రాజరాజేశ్వరి ఆలయం ముస్తాబు



కొలువైన అమ్మవారు

పటమట, న్యూస్‌టుడే: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు పటమట గణపతి సచ్చిదానంద ఆశ్రమంలోని శ్రీమరకత రాజరాజేశ్వరి ఆలయం ముస్తాబైంది. గురువారం నుంచి అక్టోబరు 12 వరకు వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు పాలక మండలి సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 8.30 గంటల నుంచి 11.30 వరకు, సాయంత్రం 5.30 నుంచి 8.30 గంటల వరకు భక్తులకు అలంకార దర్శనం కల్పిస్తారు. 9వ తేదీ ఉదయం 10 గంటలకు సరస్వతి అమ్మవారికి అభిషేకం, సామూహిక అక్షరాభ్యాసం, సాయంత్రం 6.30 గంటలకు సామూహిక సర్వసతి పూజ నిర్వహిస్తారు. 12వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు మహాపూర్ణాహుతి ఉంటుందని వెల్లడించారు.

నేటి నుంచి దేవి శరన్నవరాత్రులు

లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : లబ్బీపేటలోని శిర్డీ సాయిబాబా దేవాలయంలో గురువారం నుంచి ఈ నెల 12 వరకు దేవి శరన్నవరాత్రులు నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకుడు పరాశరం రవికుమార్ బుధవారం తెలిపారు. అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించడంతో పాటు రోజూ ఉదయం కుంకుమార్చన, హారతి, మంత్రపుష్పం, ప్రసాద వితరణ, సాయంత్రం 5 గంటలకు లలితా సహస్రనామ పారాయణం, 6 గంటలకు పల్లకిసేవ, 7 గంటలకు విశేష అర్చనలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

రమేష్ ఆసుపత్రి కూడలిలో రోడ్డు ప్రమాదం



దెబ్బతిన్న కారు

విజయవాడ, న్యూస్‌టుడే: స్థానిక రమేష్ ఆసుపత్రి కూడలిలో బుధవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ప్రాథమిక సమాచారం మేరకు.. వేగంగా వచ్చిన కారు, తొలుత ద్విచక్రవాహనాన్ని, తరువాత ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. కారులోని వ్యక్తికి, ద్విచక్రవాహనదారుడికి గాయాలయ్యాయి. కారు బెలూన్‌లు తెరచుకోవడంతో అందులోని వ్యక్తి సురక్షితంగా బయటపడ్డారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ ఎస్ఐ ఆదినారాయణ, మొబైల్ టీం ఇన్‌ఛార్జి సత్యనారాయణ వాహనాలను క్రమబద్ధీకరించారు.

సమానత్వం కోసమే పోరాటం



కేవీపీఎస్ జెండా వద్ద నాయకులు మాల్యాద్రి, క్రాంతికుమార్ తదితరులు

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా.. ఇంకా సమాజంలో కులవివక్ష కొనసాగుతోందని, దానిని నియంత్రించి.. సమానత్వం కోసం పోరాటాలు చేస్తున్నామని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి అన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సున్నపుబట్టీల కూడలిలోని రాష్ట్ర కార్యాలయంలో సంఘం పతాకాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దళితులపై కులవివక్ష, అసమానతలు, అంటరానితనం, దాడులు, హత్యలు, అత్యాచారాలు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రక్షణ చట్టాలను అమలు చేయాలని ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు. నాయకులు జి.క్రాంతికుమార్, జి.శ్యాంబాబు, పరసా కిరణ్, కె.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం.. రహదారులు జలమయం



ఆయుష్ ఆస్పత్రి వద్ద నిలిచిన వర్షపునీరు



నిర్మలా కాన్వెంట్ రోడ్డులో ..

కరెన్సీనగర్, పటమట, న్యూస్‌టుడే: మూడో డివిజన్ శ్రీరామచంద్రనగర్, కరెన్సీనగర్ కాలనీలతో పాటు హైటెన్షన్ రోడ్డు నీట మునిగింది. బుధవారం మధ్యాహ్నం నుంచి కురిసిన వానతో రాకపోకలు స్తంభించాయి. హైటెన్షన్ రోడ్డు ఆయుష్ ఆస్పత్రి నుంచి కరెన్సీనగర్ వెళ్లే మార్గం, బాయన బాబూజీ రహదారి నుంచి జాతీయ రహదారికి వెళ్లే రోడ్డు జలమయమైంది. పటమట, బెంజ్‌సర్కిల్, నిర్మలా కాన్వెంట్ దారులు నీట మునిగాయి.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

రైల్వేస్టేషన్: రైల్వే పరిసరాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్ కోరారు. బుధవారం రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛ భారత్ దివస్ వేడుకలు నిర్వహించారు. మెగా క్లీన్లీనెస్ డ్రైవ్‌లో భాగంగా విజయవాడ రైల్వేస్టేషన్‌తో పాటు పరిసరాలను రైల్వే సిబ్బంది, స్కౌట్స్ అండ్ గైడ్స్, కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు, జాక్ అండ్ జిల్ పాఠశాల, ఎన్జీవోలతో కలిసి శుభ్రం చేశారు. ఏడీఆర్ఎంలు కొండా శ్రీనివాసరావు, పి.ఇ.ఎడ్విన్, సీనియర్ డీఈఎన్(హెచ్ఎం) ఎం.కిషోర్, అన్ని విభాగాల అధికారులున్నారు.

జాతీయ త్రోబాల్ పోటీలకు రాష్ట్ర జట్లు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: హైదరాబాద్ యూసఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు జరిగే జాతీయ జూనియర్ బాలబాలికల త్రోబాల్ ఛాంపియన్‌షిప్‌లో తలపడే రాష్ట్ర జట్లు బుధవారం నగరం నుంచి పయనమయ్యాయని రాష్ట్ర త్రోబాల్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి ఇ.సులోచన తెలిపారు. స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జట్టు సభ్యులకు సంఘం ఛైర్మపర్సన్, సలహాదారు పి.సత్యనారాయణరాజు క్రీడా దుస్తులు అందించారు. జాతీయ ఛాంపియన్‌షిప్‌లో మెరుగైన ప్రతిభ ప్రదర్శించి రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేయాలన్నారు. రాష్ట్ర సంఘం కార్యదర్శి ఎండీ గౌస్‌బాబు, కోశాధికారి పి.శిరీష, రాష్ట్ర జట్టు కంటింజెంట్ నాయకుడు చందు పాల్గొన్నారు.

రాష్ట్ర ర్యాంకింగ్ టీటీ టోర్నీలో సత్తా

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: పటమటలోని ఫన్‌టైమ్స్ ఆర్‌వైజె జాతీయ టేబుల్ టెన్నిస్ (టీటీ) అకాడమీకి చెందిన క్రీడాకారులు పోటీలో సత్తా చాటారు. గత నెల 27 నుంచి మూడు రోజుల పాటు విశాఖలోని గీతమ్ వర్సిటీ ప్రాంగణంలో జరిగిన రాష్ట్ర ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో జి.తరుణ్ తేజ, డి.భువన్, జె.వైభవన్, కె.హెత్విక, ఎన్.వేదాన్ష్, జి.తరుణ్‌తేజ, ఎం.మోక్ష, టి.సంవేద్, సత్య పలు ట్రోఫీలు కైవసం చేసుకోవడంతో పాటు పి.ధ్రుతి సీబీఎస్ఈ క్లస్టర్ టీటీ టోర్నీలో అండర్-14 బాలికల విభాగంలో తలపడి వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో పసిడి పతకాలు సొంతం చేసుకొని జాతీయ పోటీలకు అర్హత సాధించింది. బుధవారం ఫన్‌టైమ్స్‌లో క్రీడాకారులను అభినందించారు. ఫన్‌టైమ్స్ కార్యనిర్వాహక కార్యదర్శి కె.విజయ్ బాబు, కార్యదర్శి కె.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ఆటోనగర్, న్యూస్‌టుడే: ఆటోనగర్ వందడుగుల రోడ్డులోని మెస్సీయ ఫెలోషిప్‌లో బుధవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. బీపీ, షుగరు, ఈసీజీ, థైరాయిడ్, బీఎండీ, 2డీ ఎకో తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. రూ.3 లక్షల విలువైన మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా మెస్సీయ ఫెలోషిప్ ఛైర్మన్ సజ్జా రత్నకుమార్ మాట్లాడుతూ... ఏటా తమ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరద బాధితులకు 15 రోజుల పాటు ఆహారం, 10 వేల దుప్పట్లు, చీరలు అందజేసినట్లు చెప్పారు. పేద మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణతో పాటు, మిషన్లు కూడా ఇస్తున్నట్లు వెల్లడించారు. సంస్థ కోఆర్డినేటర్ సజ్జా జ్యోతి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగర ప్రజలు చైతన్యవంతులు



బెంజిసర్కిల్‌లోని పింక్ టాయిలెట్ వద్ద ఎమ్మెల్యే గద్దె, కలెక్టర్ సృజన, కమిషనర్ ధ్యానచంద్ర

బెంజిసర్కిల్ (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : విజయవాడ ప్రజలు చాలా విషయాల్లో చైతన్యవంతంగా ఉంటారని, స్వచ్ఛత విషయంలోనూ అదే విధంగా ఉండాలని కలెక్టర్ జి.సృజన అన్నారు. బుధవారం బెంజి సర్కిల్‌లోని పింక్ టాయిలెట్స్ వద్ద నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్.. మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుటే ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ స్వచ్ఛ భారత్‌కు పదేళ్లు పూర్తయిన సందర్భంగా నగరంలో నిర్వహించిన వివిధ స్వచ్ఛత కార్యక్రమాల గురించి వివరించారు. కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, ముఖ్య వైద్యాధికారి పి.రత్నావళి, జోనల్ కమిషనర్ ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే సౌమ్యను సన్మానిస్తున్న ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా కార్యవర్గ రెండో సమావేశం నిర్వహించారు. మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేను కార్యవర్గసభ్యులు సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు వేముల భిక్షమయ్య అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ... విద్యారంగంలో మంత్రి లోకేశ్ విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటులో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, వారి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు. జీవో నెంబరు-117 రద్దు చేయాలని, ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను కొనసాగించాలని, గురువుల సర్దుబాటులో లోపాలు సరి చేయాలని కోరారు. ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న వివిధ బకాయిలను చెల్లించాలని, పాఠశాల గ్రాంటు వెంటనే విడుదల చేయాలని తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అరుణకిశోర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనుగ్రహప్రసాద్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామచంద్రయ్య, రాష్ట్ర కౌన్సిలర్ వీసం శ్రీధర్, కొరారు వెంకటేశ్వర్లు, సయ్యద్ రఫీ, మందా రమేష్, మేకపోతుల రామకృష్ణ, ఎస్కే జిలానీ, వడ్లమూడి శ్రీనివాసరావు, కట్టా వంశీకృష్ణ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రసాభాసగా ముగిసిన గ్రామ సభ


గొడవ పడుతున్న గ్రామస్థులు

దొడ్డదేవరపాడు(వీరులపాడు), న్యూస్‌టుడే : దొడ్డదేవరపాడులో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులపై బుధవారం గ్రామంలో నిర్వహించిన గ్రామ సభ రసాభాసగా ముగిసింది. పథకంలో చేపట్టిన పనులకు రికార్డులు లేవంటూ గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీపీ పాఠశాల నుంచి బీసీ కాలనీ వరకు చేపట్టిన సీసీ రహదారి నిర్మాణంలో అవకతవకలు చోటుచేసుకున్నాయని, కొన్ని పనులు చేయకుండానే బిల్లులు మంజూరు చేయించుకున్నారని ఆరోపించారు. ఉపాధి హామీ కూలీల్లో కొంతమంది పనులకు హాజరుకాకుండానే మస్టర్లు వేసి బిల్లులు డ్రా చేసుకున్నారని, అందుకు వారి నుంచి కమీషన్లు తీసుకున్నారని వెల్లడించారు. రికార్డులు చూపించిన తరువాతే గ్రామ సభ నిర్వహించాలని గ్రామస్థులు కోరడంతో సభ వాయిదా వేశారు. తెదేపా నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పర్యాటకంగా గుడిమెట్ల అభివృద్ధికి కృషి

చందర్లపాడు, న్యూస్‌టుడే: గుడిమెట్లలో నిర్వహించిన గాంధీ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా స్థానిక నేతలతో కలిసి చీపురుపట్టి రోడ్డు ఊడ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలన్నారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో గుడిమెట్లను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని భావించామని, కార్యరూపం దాల్చలేదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో గ్రామాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. హిందూ శ్మశానవాటికలో కంప తొలగింపు పనులను ప్రారంభించారు. సర్పంచి ఆల సైదమ్మ, మేకల సుధాకర్, మండదపు అప్పారావు, బోడేపూడి వేణుబాబు, యలమంచిలి సురేష్, నరసింహారావు, చింతకాయల నరసింహారావు, బొందల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దారులు అధ్వానం.. ప్రయాణం నరకం

కంచికచర్ల, న్యూస్‌టుడే

ఐదేళ్ల నిర్లక్ష్య పాలనలో అన్ని రంగాలను అధోగతి పాలుజేసిన వైకాపా ప్రభుత్వం రహదారుల నిర్మాణం, నిర్వహణకు నిధులు కేటాయించలేదు. ఫలితంగా నియోజకవర్గంలోని పలు రహదారులు రూపురేఖలు కోల్పోయాయి. వాహనదారులకు నిత్యం నరకాన్ని చూస్తున్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో రహదారులు మరింత అధ్వానంగా తయారయ్యాయి. పలు చోట్ల భారీ గుంతలు పడ్డాయి. రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దెబ్బతిన్న రహదారులు కొన్ని..

★ కంచికచర్ల - మున్నలూరు, మోగులూరు-మున్నలూరు, పరిటాల - గని ఆత్కూరు, కీసర-గండేపల్లి రహదారులు అధ్వానంగా మారాయి.

★ అల్లూరు - వీరులపాడు, జయంతి - ఎర్రుపాలెం, దొడ్డదేవరపాడు - వీరులపాడు, దొడ్డదేవరపాడు - వి.అన్నవరం, జమ్మవరం - పల్లంపల్లి, పెద్దాపురం- గూడెం మాధవరం మార్గాలు ఛిద్రమయ్యాయి.

★ నందిగామ మండలం కూడలి - దాములూరు, నందిగామ - రాఘవాపురం, కంచల రహదారులు రాకపోకలకు అనువుగా లేవు

★ చందర్లపాడు మండలం చందాపురం - ముప్పాళ్ల, చింతలపాడు రహదారులు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దారుణంగా దెబ్బతిన్నాయి.

★ వరదల కారణంగా కోతకు గురికావడం, రహదారులపై గుంతలు పడడంతో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

★ రహదారుల దుస్థితిపై ఎన్ని సార్లు నాటి వైకాపా పాలకులకు విన్నవించినా.. . ఫలితం లేకుండా పోయిందని, కూటమి ప్రభుత్వమైనా స్పందించి రహదారుల నిర్మాణం, మరమ్మతులకు నిధులు మంజూరు చేసి ఇక్కట్లు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.


ఆనవాళ్లు లేని మోగులూరు - మున్నలూరు రోడ్డు


రూపు కోల్పోయిన కంచికచర్ల - మున్నలూరు రహదారి


తాత్కాలిక మరమ్మతులకు చర్యలు

వరదలకు నియోజకవర్గంలో దెబ్బతిన్న రహదారులకు తాత్కాలిక మరమ్మతులు చేయడానికి సుమారు రూ.2.16 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. నిధులు మంజూరైన వెంటనే మరమ్మతులు నిర్వహించి వాహనదారుల ఇబ్బందులు తొలగిస్తామని చెబుతున్నారు. రహదారులు పూర్తిగా దెబ్బతిని మళ్లీ నిర్మించాల్సిన వాటికి సైతం అంచనాలు రూపొందించారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు మరికొన్ని రహదారులను కూడా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని అధికారులు చెబుతున్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

కంచికచర్ల: ఐదేళ్ల వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్య పాలనతో గ్రామాల్లో మౌలిక వసతులు కరవయ్యాయని తెదేపా మండల అధ్యక్షుడు కోగంటి బాబు విమర్శించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో కంచికచర్లలో నిర్మిస్తున్న 33 కల్వర్టుల నిర్మాణాన్ని నాయకులు, అధికారులతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. పంచాయతీలకు నిధులివ్వకుండా వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని అన్నారు. సర్పంచి వేల్పుల సునీత, నాయకులు నన్నపనేని నరసింహారావు, వేమా కిషోర్, గుత్తా ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు బాధ్యతల స్వీకరణ


ఎస్‌కె.హుస్సేన్

జుజ్జూరు(వీరులపాడు), న్యూస్‌టుడే : పశ్చిమ గోదావరి జిల్లాలో విధులు నిర్వహించిన ఎస్‌కే హుస్సేన్ సాధారణ బదిలీల్లో భాగంగా వీరులపాడు తహసీల్దారుగా నియమితులయ్యారు. ఇప్పటివరకు విధులు నిర్వహించిన కె.రాజకిషోర్ స్థానంలో ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో లారీ ట్రాన్స్‌పోర్ట్ అసిస్టెంట్ మేనేజర్ దుర్మరణం పాలైన ఘటన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని కోదాడ రోడ్డులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై ముత్తయ్య వివరాల ప్రకారం.. వేదాద్రి గ్రామానికి చెందిన పెసరమల్లి నరేష్‌బాబు(32) పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో ఉంటున్నారు. కోదాడ పట్టణంలోని ఓ లారీ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజరుగా పని చేస్తున్నారు. మంగళవారం కోదాడలో విధులకు వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా మల్లన్ననగర్ సమీపంలో టిప్పర్ ఢీకొంది. తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

కంచికచర్ల, న్యూస్‌టుడే : యూటీఎఫ్ కంచికచర్ల, వీరులపాడు మండలాల నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నిక కంచికచర్ల విశ్రాంత ఉద్యోగుల భవనంలో బుధవారం నిర్వహించారు. కంచికచర్ల గౌరవ అధ్యక్షుడిగా వి.సుందరరావు, అధ్యక్షుడిగా ఎస్.చలపతిరావు, ప్రధాన కార్యదర్శిగా మేరుగు రామారావు, వీరులపాడు గౌరవ అధ్యక్షుడిగా జి.రవిబాబు, అధ్యక్షుడిగా నాగేశ్వరరావు గుప్తా, ప్రధాన కార్యదర్శిగా ప్రభాకరరావులను ఎనుకున్నారు. ఎన్నికైన సభ్యులతో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రమణయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలు, 117 జీవో రద్దు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక తదితర అంశాలపై చర్చించారు. జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, డి.హరి ప్రసాద్, కె.సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఉత్సవం ప్రారంభం


జగ్గయ్యపేటలో పూజలు చేస్తున్న మహిళలు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేటలో సామూహిక బతుకమ్మ ఉత్సవాన్ని బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయగా.. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొని బతుకమ్మలాడటం ఆనవాయితీ. పెద్దరామాలయంలో బుధవారం మొదలైన ఉత్సవాన్ని గురువారం వరదరాజస్వామి, శుక్రవారం ముత్యాలమ్మ ఆలయం, శనివారం చంద్రమౌళీశ్వరాలయం, ఆదివారం కన్యకాపరమేశ్వరి ఆలయం, సోమవారం కనకదుర్గాలయం, మంగళవారం చెన్నకేశవాలయం, బుధవారం రంగనాయకస్వామి, గురువారం రేణుకాపరమేశ్వరీ ఆలయాల్లో జరగనున్నాయి. జగ్గయ్యపేటలో దసరా శరన్నవరాత్రులకు అమ్మవార్ల ఆలయాలు ముస్తాబయ్యాయి.


నందిగామ: గాంధీ, శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సౌమ్య, నాయకులు


నందిగామ: కోర్టులో న్యాయమూర్తి షేక్ రియాజ్, న్యాయవాదుల నివాళి


నందిగామ: వైకాపా కార్యాలయంలో...


నందిగామ గ్రామీణం: యూటీఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో...


నందిగామ గ్రామీణం: పాతకంచలలో నినాదాలు చేస్తున్న వీరాస్వామి, కూటమి నాయకులు


నందిగామ గ్రామీణం: తొర్రగుడిపాడులో పుస్తకాల సంచుల పంపిణీ


వీరులపాడు: జుజ్జూరు తహసీల్దారు కార్యాలయంలో...


జగ్గయ్యపేట: మున్సిపల్ కార్యాలయంలో జాతిపితకు ఎమ్మెల్యే తాతయ్య, రాఘవేంద్ర, కౌన్సిలర్ల నివాళి

గాంధీజీ... అన్ని తరాలకు మార్గదర్శి

న్యూస్‌టుడే బృందం: నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో బుధవారం జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతిని ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ. . అహింసా పద్ధతిలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహనీయుడు గాంధీ అని కొనియాడారు. అన్ని తరాలకు గాంధీ మార్గదర్శకుడని పేర్కొన్నారు. గాంధీజీ ఆశయాల సాధన కోసం శాంతి, సహనం, ఐకమత్యంతో పని చేయాలని సూచించారు. స్వచ్ఛత దిశగా అందరూ అడుగులు వేయాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. విద్యార్థులకు పుస్తకాల సంచులు పంపిణీ చేశారు. మాజీ ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి... రైతులు, సైనికుల సంక్షేమానికి కృషి చేశారని అన్నారు.


జగ్గయ్యపేట: మున్సిపల్ పార్క్‌లో మహాత్ముడికి నివాళులు అర్పిస్తున్న సామినేని ఉదయభాను


మహాత్మాగాంధీకి నివాళులు అర్పిస్తున్న జగ్గయ్యపేట వైకాపా నాయకులు


వీఎస్‌పీ జగ్గయ్యపేట లైమ్‌మైన్స్ కార్యాలయంలో...


పెనుగంచిప్రోలులో తెదేపా నాయకులు...


పెనుగంచిప్రోలు: పంచాయతీ కార్యాలయంలో...


పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్‌లో...


పెనుగంచిప్రోలు: ఆర్యవైశ్య సంఘ నాయకుల ఆధ్వర్యంలో...

క్షేత్రానికి అధికారులు.. మెరుగైన దిగుబడులు

కంచికచర్ల, న్యూస్‌టుడే



కంచికచర్ల మండలం గొట్టుముక్కలలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో అధికారులు

అన్నదాతలు మెరుగైన దిడుబడులు సాధించేలా కూటమి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. గతంలోలా మొక్కు'బడి'గా కాకుండా... మంచి ఫలితాలు సాధించేలా 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించింది. ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేసే రైతన్నలు... ప్రకృతి విపత్తులు, చీడ పీడలు, వాతావరణ మార్పులతో నష్టపోతున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కర్షకుల సాగు కష్టాలను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం.. అన్నదాతలకు అండగా ఉండి వ్యవసాయం లాభసాటి చేయాలని నిర్ణయించింది.

వారానికి రెండు రోజులు

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వారానికి రెండు రోజులు (ప్రతి మంగళ, బుధవారం) కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. గ్రామ స్థాయి నుంచి డివిజన్ స్థాయి అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్తారు. రబీ సీజన్ నాలుగు నెలల పాటు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఉదయం, మధ్యాహ్నం రెండు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తారు. క్షేత్ర స్థాయి బృందంలో వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మార్కెటింగ్, ప్రకృతి సేద్యం, డెయిరీ శాఖల అధికారులు ఉంటారు. అన్నదాతల సమస్యలు, సందేహాలను నివృత్తి చేస్తారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ.. పంటలు పరిశీలిస్తూ.. గుర్తించిన అంశాలను రైతులకు వివరిస్తారు. సాగులో మెలకువలు, చీడపీడల నివారణ చర్యలు, మార్కెటింగ్ పద్ధతులు, నూతన విత్తనాలపై అవగాహన, సేంద్రియ ఎరువుల తయారీ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు.

అన్ని దశల్లో అవగాహన

'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ద్వారా నేల స్వభావం, వాతావరణ పరిస్థితులకు అనువైన వంగడాల ఎంపిక, రసాయనాల వాడకం తగ్గిస్తూ.. సేంద్రియ ఎరువుల వినియోగం పెంపు, పెట్టుబడి తగ్గించడం, పంటల సస్య రక్షణ విధానాలు... ఇలా ప్రతి దశలో రైతులకు అవగాహన కల్పించడమే లక్ష్యం. క్షేత్ర స్థాయిలో అన్నదాతలకు అందుబాటులో ఉండి మెరుగైన దిగుబడులు సాధించేలా చేయడమే ధ్యేయం.

- ఐ.కె.శ్రీనివాస్, ఏడీఏ, నందిగామ డివిజన్

తిరుపతమ్మ దేవస్థానానికి విరాళం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారి దేవాలయానికి పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరుకు చెందిన శ్రీరాం భూపాల్ రూ.15 వేల విరాళాన్ని బుధవారం అందజేసినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపారు. దాత తొలుత అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు అతనిని శేషవస్త్రాలతో ఘనంగా సత్కరించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

పటమట: విజయవాడలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నేత సామినేని ఉదయభాను పిలుపునిచ్చారు. ఉదయభాను జనసేనలోకి వచ్చిన నేపథ్యంలో బుధవారం పటమటలోని ఆయన క్యాంపు కార్యాలయంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ నాయకులు అతన్ని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో జనసేన పార్టీ రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించనుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. ఎవరి ప్రాంతంలో వారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. నాయకులు మల్లెపు విజయలక్ష్మి, ప్రదీప్ రాజ్, రౌతు వాసు, పల్లకి ఆది బాబు, బగ్గా దుర్గాప్రసాద్, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు పెద్దపీట వేద్దాం


పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలు, సామగ్రి అందిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, కోహెన్స్ ప్రతినిధులు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: మెరుగైన సమాజం కోసం పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య అన్నారు. కోహెన్స్ కర్మాగారం ఆధ్వర్యంలో జగ్గయ్యపేటలోని పురపాలక సంఘ కార్మికులకు బుధవారం దుస్తులు, సామగ్రిని అందించే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కర్మాగారం ప్రతినిధి సీఎస్ఎన్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ ఛైర్మన్ శ్రీరాం సుబ్బారావు సహా పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్తు పునరుద్ధరణ పనులు వేగవంతం

కొన్ని గ్రామాలకు అరకొర సరఫరా

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే

వరదల తాకిడి సంభవించి నెల రోజులు పూర్తయినా ఇంకా నియోజకవర్గంలోని పలు గ్రామాలకు పూర్తి స్థాయిలో విద్యుత్తు సరఫరా రాలేదు. నెల రోజులుగా విద్యుత్తు శాఖ సిబ్బంది పునరుద్ధరణ కోసం కసరత్తు కొనసాగిస్తున్నా జరిగిన నష్టం పెద్దది కావడంతో అది పూర్తి కాలేదు. పట్టణం సహా నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల్లో ఇంకా పనులు పూర్తి కాలేదు. సబ్ డివిజన్ పరిధిలో మొత్తం 35 గ్రామాలు వరద ప్రభావానికి లోను కాగా.. ఇంకా 10 గ్రామాల్లో పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. ధ్వంసమైన 666 ట్రాన్స్‌ఫార్మర్లలో 600 వరకూ సిబ్బంది పునరుద్ధరించారు. మిగిలిన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలి. దెబ్బతిన్న 2,600 విద్యుత్తు స్తంభాల్లోనూ 90 శాతం తిరిగి ఏర్పాటుచేశారు. 106 కిలోమీటర్ల మేర కండక్టర్‌కి గాను మూడొంతుల పని పూర్తయింది.

మండలంలో ఇలా..

జగ్గయ్యపేట మండలం బూదవాడ, అన్నవరం, పెనుగంచిప్రోలు మండలంలోని అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు, వత్సవాయి మండలంలోని దబ్బాకుపల్లి సహా మరికొన్ని గ్రామాల్లో అధికారులు, సిబ్బంది ఇంకా పునరుద్ధరణ పనులు చేస్తూనే ఉన్నారు. కొంతమేర సామగ్రి సరఫరా లోపం కారణం కాగా, మరి కొన్ని చోట్ల స్థానిక పరిస్థితులు అనుకూలించక జాప్యం తప్పడంలేదు.

నిరంతరం విద్యుత్తు సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా విద్యుత్తు ఆధారిత వ్యాపారులు సమస్యను ఎదుర్కొంటున్నారు. వ్యాపారాలు సాగక నష్టపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి పనులు వేగవంతం చేయాలని కోరుతున్నారు.


అన్నవరం గ్రామానికి స్తంభాల ఏర్పాటు

పురోగతిలో పనులు: ఏడీఈ శ్రీనివాసరావు

అన్నిరకాల నష్టాలను 90 శాతం పునరుద్ధరణతో భర్తీ చేశాం. మిగిలిన పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. మరో పది రోజుల్లో అన్ని గ్రామలకూ పూర్తిస్థాయిలో సరఫరా పునరుద్ధరణ జరుగుతుంది.

విజయవాడ పశ్చిమ

శరన్నవరాత్రులకు సర్వం సిద్ధం


వంగవీటి వీఎంసీ పాఠశాల వద్ద రహదారిపై నీళ్లు చల్లుతూ..


వివిధ రకాల సేవలకు సంబంధించిన టెంట్లు

భవానీపురం, చిట్టినగర్, న్యూస్‌టుడే: దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని స్నానఘాట్‌ల వద్ద ఏర్పాట్లు పూర్తయ్యాయి. కృష్ణానది ఒడ్డున ఉన్న పున్నమి, భవానీస్నాన ఘాట్‌ల వద్ద భక్తుల జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేశారు. దూర ప్రాంతాల వారి వాహనాలు నిలిపేందుకు స్థలాన్ని సిద్ధం చేశారు. దుస్తులు మార్చుకునేందుకు, కేశఖండన శాల, క్లోక్ రూం, వైద్యశిబిరం, సమాచారం కేంద్రం, తదితర వాటిని ఏర్పాటుకు టెంట్లు వేశారు. కొండ చుట్టూ గిరి ప్రదక్షణ సమయంలో దుమ్ము లేవ కుండా ఉండేందుకు నగరపాలక సంస్థ సిబ్బంది ట్యాంకర్ల నీటితో నింపి పైపుల ద్వారా రోడ్లు పరిశుభ్రం చేశారు.


ఘాట్ పరిసరాలను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు


భవానీ ఘాట్ వద్ద మరుగుదొడ్లు...


ముస్తాబైన చిట్టినగర్ మహాలక్ష్మి అమ్మవారి ఆలయం


కేబీఎన్‌లో చండీయాగం కోసం ఏర్పాట్లు

ఆలయాలలో దసరా శోభ


విజయ దుర్గా ఆలయం

చిట్టినగర్, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రి కొండ చుట్టూ ఉన్న పలు అమ్మవారి ఆలయాలు దేవీశరన్నవరాత్రుల మహోత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. ప్రధానంగా చిట్టినగర్‌లోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, పాలఫ్యాక్టరీ వద్ద విజయదుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం, వీఎంసీ కాలనీలోని కనకదుర్గ ఆలయం, పలు ఆలయాల్లో దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు.

ద్విచక్ర వాహనాలకే అనుమతి


విధుల్లోకి వచ్చిన పోలీసు సిబ్బంది

భవానీపురం, న్యూస్‌టుడే: దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని భారీ సంఖ్యలో పోలీసులను బందోబస్తుగా నియమించారు. కనకదుర్గ ఫ్లైవంతెన, స్నాన ఘాట్‌ల వద్ద పోలీసు సిబ్బందిని నియమించారు. కనకదుర్గ ఫ్లైవంతెన దిగువన కేవలం ద్విచక్ర వాహనాలను మాత్రమే అనుమతించడానికి బారికేడ్లను ఏర్పాటు చేశారు.

జగన్మాత వైభవం.. జగమంతా సంబరం


చిన్న రాజగోపురం వద్ద దుర్గమ్మ విగ్రహానికి మెరుగులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ప్రతిష్ఠాత్మకంగా ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కనకదుర్గానగర్, ఘాట్ రోడ్డు మార్గంలో అభివృద్ధి పనులు జరుగుతుండటంతో దసరా ఏర్పాట్లు పూర్తి కావడానికి చివరి నిమిషం వరకు సమయం తీసుకుంది.

❖ సాంస్కృతిక కార్యక్రమాల వేదికను కనకదుర్గానగర్ ప్రారంభంలో ఏర్పాటు చేయడంతో కళాకారుల కష్టాలు తీరాయి. గతంలో మల్లికార్జున మహామండపం పక్కన ఏర్పాటు చేయడంతో ప్రదర్శనలో పాల్గొనేందుకు వచ్చిన కళాకారులు పోలీసు ఆంక్షలతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ఈసారి కళాకారులు నేరుగా కళావేదిక వద్దకు చేరేందుకు మార్గం సుగమమైంది.

చిన్న రాజగోపురం వద్ద..: దసరా ఉత్సవాల్లో ఆలయ ప్రవేశ మార్గమైన చిన్న రాజగోపురం వద్ద ఉన్న దుర్గమ్మ విగ్రహానికి తుది మెరుగులు దిద్దారు. దుర్గమ్మ దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడు ఈ విగ్రహాన్ని దర్శించుకున్న తరువాత స్వర్గగోపురాన్ని వీక్షిస్తారు. మహిషాసురమర్దిని దేవి అలంకారంలో ఉన్న అమ్మవారు భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నారు.

కీలకంగా టోల్‌గేట్ ప్రాంతం

దుర్గగుడి టోల్‌గేటు వద్దకు చేరుకున్న పోలీసు బృందాలకు డ్యూటీ పాయింట్లు కేటాయించారు. దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తులను నియంత్రించేందుకు కీలకమైన టోల్‌గేట్ వద్దకు రెండు క్యూలైన్లు వస్తాయి. కెనాల్ రోడ్డు వినాయకుడి గుడి, కుమ్మరిపాలెం సెంటరు సమీపంలోని హెడ్ వాటర్ వర్క్సు నుంచి వచ్చే క్యూలైన్లు ఇక్కడి నుంచే ఘాట్ రోడ్డులోకి ప్రవేశిస్తాయి. కుమ్మరిపాలెం సెంటరు నుంచి వచ్చే క్యూలైన్లు ఫుట్ ఓవర్ బ్రిడ్జి మీదుగా టోల్‌గేటు క్యూలైన్లలోకి ప్రవేశిస్తుంది. ఇక్కడే పోలీసు విధులు కీలకం.


అన్నప్రసాద పంపిణీ వద్ద ఏర్పాట్లు

❖ వివిధ నిమిత్తం వరకు దసరా ఉత్సవాల్లో అన్నప్రసాద పంపిణీ ఏ విధంగా చేయాలని తలలు పట్టుకున్న దేవస్థానం అధికారులు కఠోర శ్రమతో నిర్మాణంలో ఉన్న అన్నదాన భవనాన్ని ప్రస్తుత అన్నప్రసాద పంపిణీ కేంద్రంగా మార్చారు. దర్శనం చేసుకున్న భక్తులు మల్లేశ్వరాలయ మెట్ల మార్గంలో వచ్చిన వారు మల్లికార్జున మహామండపం నుంచి అన్నప్రసాద పంపిణీ కేంద్రానికి చేరతారు. అక్కడ అన్నప్రసాదం స్వీకరించిన తరువాత కనకదుర్గానగర్‌లోని ప్రసాదాల కేంద్రంలో లడ్డూ, పులిహోర ప్రసాదాలు తీసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు.

కనకదుర్గానగర్‌లో వైద్యసేవలు

దుర్గమ్మ దర్శనం చేసుకున్న భక్తులకు వైద్యసేవలు, తాగునీరు అందించేందుకు ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. అస్వస్థతకు గురైన భక్తులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఇక్కడే అంబులెన్సు, అగ్నిప్రమాదాలు నివారించేందుకు అగ్నిమాపక వాహనం ఉంటారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఉచితంగా మందులు అందజేసేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. ఘాట్ రోడ్డు మార్గం కనకదుర్గానగర్‌లో మొత్తం 12 చోట్ల వైద్యులు అత్యవసర సేవలు అందించేందుకు తగిన చర్యలు చేపట్టారు.


సాంస్కృతిక కార్యక్రమాల వేదిక

❖ దసరా ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 3 నుంచి 15వ తేదీ వరకు ప్రస్తుతం ఉన్న దుకాణాలను మూసివేయాలని దేవస్థానం అధికారులు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే కనకదుర్గానగర్‌కు వెలుపల ఉన్న దుకాణాలను మున్సిపల్ అధికారులు కొంత మేర తొలగించారు. అద్దెలు చెల్లించిన దుకాణదారులు మాత్రం తమకు గతంలో లాగా ఉత్సవాల్లో భక్తులకు పూజాద్రవ్యాలు విక్రయించేందుకు అనుమతించాలని కోరుతున్నారు.

భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు


మాట్లాడుతున్న ఈవో రామారావు, స్థానాచార్య శివప్రసాదశర్మ, డిప్యూటీ ఈవో రత్నరాజు, డీసీ శేఖర్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : భక్తులకు అసౌకర్యం లేకుండా దసరా ఉత్సవాల ఏర్పాట్లు పూర్తి చేశామని దుర్గగుడి ఈవో రామారావు అన్నారు. ఇంద్రకీలాద్రిపై మల్లికార్జున మహామండపంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈవో మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిర్వహించే ఉత్సవాల్లో భక్తులు వినాయకుడి గుడి నుంచి క్యూలైన్లో వచ్చిన భక్తులు ఘాట్ రోడ్డు మార్గంలో దర్శనం చేసుకొని మల్లేశ్వరాలయ మెట్ల మార్గం నుంచి కనకదుర్గానగర్‌కు చేరే విధంగా ఏర్పాటు చేశామన్నారు. తొలి రోజు అమ్మవారికి స్నపనాభిషేకం నిర్వహించిన తరువాత బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకారం చేస్తారన్నారు. 10న వేద సభ, 11న అర్చక సభలను మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో నిర్వహిస్తారన్నారు. డిప్యూటీ ఈవో రత్నరాజు, డీసీ శేఖర్, స్థానాచార్య శివప్రసాదశర్మ, వైదిక కమిటీ సభ్యులు శ్రీనివాస శాస్త్రి పాల్గొన్నారు.


పాతబస్తీలో గాంధీవిగ్రహానికి పూలమాల వేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



గాంధీ కొండపై గంగరాజు, గాంధీహిల్‌ఫౌండేషన్ సభ్యులు, కాళేశ్వరరావు మార్కెట్ వద్ద


వైకాపా కార్యాలయంలో ..


భవానీపురం: నివాళి అర్పిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర, మేయర్ భాగ్యలక్ష్మి

ఓ మహాత్మా నీ జీవితం... నేటి యువతరానికి ఆదర్శం


పాలఫ్యాక్టరీ వద్ద గాంధీ దేవాలయంలో ..

న్యూస్‌టుడే బృందం: పట్టణంలో మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం పలు చోట్ల ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలు, ఉద్యమాలు, త్యాగాలను నెమరు వేసుకున్నారు. అహింసా సిద్ధాంతం ద్వారా ఏదైనా సాధించవచ్చునని దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకువచ్చారని గుర్తుచేసుకున్నారు. ఆయన జీవితాన్ని నేటి యువతరం ఆదర్శంగా తీసుకొని ఆయన బాటలో ముందుకు నడవాలని పలు ప్రముఖులు అన్నారు.


కేఎల్‌రావు పార్కులో ..


వించిపేటలో..


కస్తూరి సీతారామయ్య వీఎంసీ పాఠశాలలో..


భవానీపురం: జనసేనపార్టీ కార్యాలయంలో..


హెచ్‌బీ కాలనీలోని పింఛనర్ల సంఘ కార్యాలయంలో..


మాట్లాడుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

పారిశుద్ధ్య కార్మికుల వల్లే ర్యాంకులు


రహదారిని ఊడుస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులు

భవానీపురం, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికుల వల్లే విజయవాడ నగరానికి స్వచ్ఛ సర్వేక్షన్‌లో మూడేళ్లుగా ర్యాంకులు వస్తున్నాయని నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా విజయవాడ నగర పాలక సంస్థ కార్యాలయ పరిసరాలను మేయర్, కమిషనర్, అధికారులు బుధవారం శుభ్రం చేశారు. ధ్యానచంద్ర మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ స్వచ్ఛత వైపు అడుగులు వేయాలని, నగరాన్ని స్వచ్ఛంగా ఉంచుతూ ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని సెప్టెంబరు 17న ప్రారంభించి ఎన్నో కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. స్వచ్ఛతపై అవగాహన కల్పించే సెల్ఫీ స్టాండ్ వద్ద సెల్ఫీ దిగారు. నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా.రత్నావళి, సిటీ ప్లానర్ ప్రసాద్, ఎస్‌ఈ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి


విజేతలతో వీఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: విద్యార్థులు పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని వించిపేటలోని మహ్మదాలీపురం నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.వి.నగరాజకుమారి అన్నారు. పాఠశాలలో హిందీ దినోత్సవం, గాంధీ జయంతి బుధవారం నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు ఏవీఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో బహుమతులు అందించారు. సంస్థ కన్వీనర్ వెంకటరెడ్డి, ఆంజనేయులు, హరినాథ్, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి


చెత్త తొలగిస్తున్న డీఆర్‌ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్

రైల్వేస్టేషన్: రైల్వే పరిసరాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని డీఆర్‌ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్ కోరారు. బుధవారం రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛ భారత్ దివస్ వేడుకలు నిర్వహించారు. మెగా క్లీన్లీనెస్ డ్రైవ్‌లో భాగంగా విజయవాడ రైల్వేస్టేషన్‌తో పాటు పరిసరాలను రైల్వే సిబ్బంది, స్కౌట్స్ అండ్ గైడ్స్, కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు, జాక్ అండ్ జిల్ పాఠశాల, ఎన్జీవోలతో కలిసి శుభ్రం చేశారు. ఏడీఆర్‌ఎంలు కొండా శ్రీనివాసరావు, పి.ఇ.ఎడ్విన్, సీనియర్ డీఈఎన్(హెచ్‌ఎం) ఎం.కిషోర్, అన్ని విభాగాల అధికారులున్నారు.

అలంకారప్రాయం.. మినీ థియేటర్లు

ఆర్టీసీ ఆదాయానికి గండి, అధికారుల నిర్లక్ష్య ధోరణి

విజయవాడ బస్‌స్టేషన్, న్యూస్‌టుడే

పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడ దుకాణాలు 24 గంటలూ తెరిచే ఉంటాయి. ఈ నేపథ్యంలో దేశంలోనే ప్రయోగాత్మకంగా బస్‌స్టేషన్ ఆధునికీకరణలో భాగంగా అప్పటి ఆర్టీసీ ఎండీ ఎన్. సాంబశివరావు సూచన మేరకు అరైవల్ బ్లాక్‌లో 2015లో మినీ థియేటర్లు ఏర్పాటు చేశారు. 24 గంటలూ చలన చిత్రాలు ప్రదర్శించేలా ఒక్కో థియేటర్‌ను 126 సీట్ల సామర్థ్యంతో రెండు తెరలు ఏర్పాటు చేశారు.

●● 2018 వరకు సక్రమంగా అద్దె చెల్లించిన గుత్తేదారుడు, 2019 నుంచి సక్రమంగా అద్దె చెల్లించకపోవడంతో ఆర్టీసీ అధికారులు 2020 జనవరి 27న ఆర్టీసీ అధికారులు మొదటి సారి సీజ్ చేశారు. థియేటర్ యజమాని అప్పటి ఆర్టీసీ ఎండీని అభ్యర్థించగా సానుకూలంగా స్పందించిన ఆయన బకాయిలు చెల్లించుకునేందుకు అవకాశం కల్పించారు.

●● యజమాని మళ్లీ బకాయిలు చెల్లించకపోవడంతో ఆర్టీసీ అధికారులు రెండోసారి సీజ్ చేశారు. దాంతో యజమాని 2022 ఏప్రిల్‌లో హైకోర్టు ద్వారా స్టే తెచ్చుకున్నారని, బకాయిలు వాయిదా పద్ధతిలో చెల్లించుకునేందుకు అవకాశం కల్పించినట్లు కోర్టు ఉత్తర్వుల్లో ఉందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

●● కోర్టు తీర్పు సక్రమంగా అమలు చేయని పక్షంలో ఆర్టీసీ అధికారులు ఇచ్చిన లెటర్‌ను అమలు చేయవచ్చని తీర్పులో ఉందని అప్పటి బస్‌స్టేషన్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌గా ఉన్న బషీర్ అహ్మద్ తెలిపారు. రెండో సారి సీజ్ చేసే నాటికే రూ. కోటికి పైగా బకాయిలున్నాయని పేర్కొన్నారు.


మూతపడిన సినిమా హాళ్లు ఇవే..

●● 2022 జూన్ 11న థియేటర్‌ను సీజ్‌చేసి నివేదికను ఆర్టీసీ ఉన్నతాధికారులకు పంపడంతో జిల్లా ప్రజారవాణాధికారి ఆధ్వర్యంలో ఈ-టెండరింగ్ ద్వారా వేలం వేయడానికి సన్నాహాలు చేశారు. తరువాత దానిని పట్టించుకోకపోవడంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు థియేటర్ మూతపడే ఉంది. దీంతో థియేటర్, పరిసర ప్రాంతాలు ఎలుకలకు ఆవాసంగా మారాయి. ఈ ప్రదేశం అంతా తీవ్ర దుర్గంధభరితంగా తయారైందని ప్రయాణికులు వాపోతున్నారు. థియేటర్ వెనుక ఆర్టీసీ కొరియర్ అండ్ పార్సిల్ కార్యాలయం ఉంది. ఇక్కడి ఎలుక బెడద తట్టుకోలేక వాటి నిర్మూలనకు ఆర్టీసీ రూ. 17 వేలు వెచ్చించిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఆర్టీసీ ఆదాయం కోల్పోతున్నా ఇంకా సరైన చర్యలు తీసుకోలేదనే విమర్శలు వస్తున్నాయి.


ఎలుకలకు ఆవాసంగా


థియేటర్ల పక్కన వ్యర్థాల గుట్ట

●● థియేటర్ నిర్మించకముందు ఇక్కడ 12 వరకు దుకాణాలు ఉండేవి. ఒక్కో దుకాణానికి సుమారు రూ. 30 వేల వరకు ఆర్టీసీకి అద్దెవచ్చేది. ఈ ఆదాయం ఆర్టీసీ కోల్పోయింది.

●● మినీ థియేటర్‌లను కొన్ని మార్పులు చేసి ఏదైనా కాన్ఫరెన్స్, ఫంక్షన్ హాల్‌లా మార్చుకున్నా ఆదాయం వచ్చేదని కొందరు ఆర్టీసీ అధికారులే పేర్కొంటుండటం గమనార్హం. సంబంధిత అధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి


ఉదయభానుని సన్మానిస్తున్న పశ్చిమ నియోజకవర్గ జనసేన నేతలు

పటమట, న్యూస్‌టుడే: విజయవాడలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నేత సామినేని ఉదయభాను పిలుపునిచ్చారు. ఉదయభాను జనసేనలోకి వచ్చిన నేపథ్యంలో బుధవారం పటమటలోని ఆయన క్యాంపు కార్యాలయంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ నాయకులు అతన్ని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో జనసేన పార్టీ రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించనుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. ఎవరి ప్రాంతంలో వారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. నాయకులు మల్లెపు విజయలక్ష్మి, ప్రదీప్ రాజ్, రౌతు వాసు, పల్లకి ఆది బాబు, బగ్గా దుర్గాప్రసాద్, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న వాసుదేవరావు, తూనికుంట్ల, తదితరులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: వరద బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాస్ అన్నారు. కళాశాలలో వంకదారు రంగయ్య, శకుంతల విద్యానిధి ఛైర్మన్ వంకదారు వాసుదేవరావు ఆధ్వర్యంలో వరద బాధిత కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కోశాధికారి హరగోపాల్, హిందూ హైస్కూల్స్ కోశాధికారి గోళ్ల బాబావిజయ్‌కుమార్, రామకిషోర్, నారాయణరావు, కృష్ణవేణి, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న సూపరింటెండెంట్ సత్యనారాయణ


రాష్ట్ర హోంమంత్రి అనితకు చిత్రపటం అందజేస్తూ..


కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు..


ప్రధానార్చకుడు దుర్గాప్రసాద్‌కు పట్టుచీర అందజేస్తున్న సినీ దర్శకుడు పరశురామ్ కుటుంబం

జగన్మాత సేవలో మంత్రులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ దంపతులు, హోంమంత్రి వంగలపూడి అనిత కుటుంబం, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వేర్వేరుగా బుధవారం దర్శించుకున్నారు. వారికి దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

అమ్మవారి అలంకరణకు రూ. 2లక్షలు విలువ చేసే పట్టుచీర: దసరా ఉత్సవాలను పురస్కరించుకొని జగన్మాత దుర్గమ్మను అలంకరించేందుకు ప్రముఖ దర్శకులు పరశురామ్ దంపతులు రూ. 2లక్షలు విలువ చేసే పట్టుచీరను బుధవారం దేవస్థానం ప్రధాన అర్చకులు దుర్గాప్రసాద్‌కు అందజేశారు. దాతలు రావాడ చిరంజీవిరావు, శ్రీనివాసరావు, నాగజ్యోతి పదిరోజులు అమ్మవారి అలంకరణ నిమిత్తం పట్టుచీరలను అందజేశారు.

విజయవాడ మధ్య

భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : భక్తులకు అసౌకర్యం లేకుండా దసరా ఉత్సవాల ఏర్పాట్లు పూర్తి చేశామని దుర్గగుడి ఈవో రామారావు అన్నారు. ఇంద్రకీలాద్రిపై మల్లికార్జున మహామండపంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈవో మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిర్వహించే ఉత్సవాల్లో భక్తులు వినాయకుడి గుడి నుంచి క్యూలైన్లో వచ్చిన భక్తులు ఘాట్ రోడ్డు మార్గంలో దర్శనం చేసుకొని మల్లేశ్వరాలయ మెట్ల మార్గం నుంచి కనకదుర్గానగర్‌కు చేరే విధంగా ఏర్పాటు చేశామన్నారు. 10న వేద సభ, 11న అర్చక సభలను మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో నిర్వహిస్తారన్నారు. డిప్యూటీ ఈవో రత్నరాజు, డీసీ శేఖర్, స్థానాచార్య శివప్రసాదశర్మ, వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM 63036 11232

? నందమూరినగర్ జీసీఆర్ కాలనీలో వరద నీరు, చెత్త పేరుకుపోయింది. దుర్గంధం వెదజల్లుతోంది. దోమలతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. **- ఆర్.అనిల్‌కుమార్, స్థానికుడు**

✔ పరిశీలించి వ్యర్థాలు తొలగిస్తాం.

- వి.రామకోటేశ్వరరావు, ఏఎంవోహెచ్, వీఎంసీ

– న్యూస్‌టుడే, సీతారాంపురం

కబ్జాకు అడ్డుకట్ట



దిమ్మెలకు కట్టిన కర్రలు తొలగించారిలా...

స్పందనకు వందనం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : లెనిన్ కూడలిలోని 'ఐలాండ్ పార్కు'ను కబ్జా చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలకు అడ్డుకట్ట పడింది. పార్కు ప్రవేశ ద్వారాలను కర్రలతో మూసివేసి, అక్కడ తోపుడు బళ్లు పెట్టేందుకు గుట్టుచప్పుడు కాకుండా పావులు కదుపుతున్న వైనాన్ని 'ఈనాడు' వెలుగులోకి తెచ్చింది. 'కర్రలతో పాగా..!' శీర్షికన బుధవారం కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. హుటాహుటిన ఐలాండ్ పార్కు వద్దకు వచ్చి.. కర్రలు కట్టిందెవరని ఆరా తీశారు. ఎవరూ నోరు మెదపకపోవడంతో.. ఇనుప తీగలతో పక్కాగా బిగించిన కర్రలను పూర్తిగా తొలగించారు.

ఉరుములు.. మెరుపులు

జోరు వానతో రహదారులు జలమయం



మధురానగర్ ఆర్‌యూబీలో నిలిచిన నీటిలో వెళుతున్న కారు



పాయకాపురంలో పేదల నివాసాల రోడ్డులో..

నగరంలో ఏకధాటిగా గంట సేపు.. ఉరుములు, మెరుపులతో కురిసిన వానకు పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధాన రహదారులు వర్షపు నీటితో నిండిపోయి.. చెరువులను తలపించాయి. పేదలు నివసించే రాజీవ్‌నగర్, పాయకాపురంలోని వీధులు మునిగాయి. 31వ డివిజన్, శ్రీనగర్‌కాలనీ మొత్తం నీళ్లు నిలిచిపోయాయి. ఇక్కడ వర్షపు నీటి మళ్లింపు కాలువలు లేకపోవడంతో సమస్య తీవ్రంగా ఉంది.

నిలిచిన సరఫరా.. పనిచేయని మోటార్లు..

ఒక్కసారిగా కుండపోత వర్షానికి మధురానగర్ ఆర్‌యూబీ వాన నీటితో నిండిపోయింది. బయటకు పోయేందుకు ప్రత్యేకంగా మోటార్లు ఉన్నా.. అవి తోడలేకపోయాయి. మరోవైపు పిడుగులు, ఉరుములు వస్తుండడంతో అధికారులు ముందుజాగ్రత్త చర్యగా విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. దీంతో మోటార్లు పనిచేయలేదు. చాలా సేపు వర్షం నీటిని తోడకపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొద్దిసేపటి తర్వాత నీరు తగ్గడంతో కార్లు, మోటారు సైకిళ్లు మాత్రం వెళ్లగలిగాయి. చిన్న చిన్న మోపెడ్లు.. నీటిలో మునిగిపోతుండడంతో రాకపోకలు స్తంభించాయి. దాదాపు గంటన్నర తర్వాత.. ఉద్ధృతి తగ్గడంతో రాకపోకలు పునరుద్ధరించారు.

– మధురానగర్, న్యూస్‌టుడే



శ్రీనగర్‌కాలనీ రహదారి పొడవునా నీరే..

నవరాత్రి ఉత్సవాలకు సిద్ధం..!

కాంతులీనుతున్న ఆలయాలు

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే

విజయవాడ కనకదుర్గ అమ్మవారి నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు అన్ని ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం (నేటి) నుంచి ప్రారంభమయ్యే పూజా క్రతువులకు ముస్తాబు చేశారు. భక్తులకు సౌకర్యవంతంగా నిర్వాహకులు క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. అన్ని రకాల వసతులు సమకూర్చారు. ప్రతి రోజు కుంకుమ పూజలు, హోమాలు, పంచహారతులు ఉంటాయి.

సత్యనారాయణపురంలోని అన్నపూర్ణాసమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవిని గురువారం నుంచి రోజు ఒక అవతారంతో అలంకరణ చేయనున్నట్లు ఈవో సుపద్మాదేవి తెలిపారు. తెల్లవారుజాము 4 గంటల నుంచి పూజలు ఆరంభమవుతాయని చెప్పారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో దసరా మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు తుమ్మల వెంట శ్రీనివాసు తెలిపారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. అయోధ్యనగర్ ధర్మపరిషత్ సంస్థానం ఆధ్వర్యంలోని శివ కామేశ్వరీ సమేత నీలకంఠేశ్వర స్వామివారి మందిరంలో.. తొలి రోజు అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరిస్తామని సంస్థాన వ్యవస్థాపకులు హేమ సుందర వరప్రసాద్ తెలిపారు. ప్రత్యేక కళా వేదికపై విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తారు. ముత్యాలంపాడు పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతి రోజూ చండీహోమం ఉంటుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు నరసింహ రాజు తెలిపారు.



సత్యనారాయణపురంలోని శివాలయం



అయోధ్యనగర్ ధర్మపరిషత్ ఆలయం



ముత్యాలంపాడు శివాలయం

అందరికీ అమ్మ దీవెనలు



ఉత్సవాల ఆహ్వాన పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు, సుపద్మాదేవి

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే : దసరా నవరాత్రి మహోత్సవాలను కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో నిర్వహిస్తోందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. సత్యనారాయణపురంలోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే దసరా నవరాత్రి మహోత్సవాల ఆహ్వాన పుస్తకాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఈవో సుపద్మాదేవి, తెదేపా 33వ డివిజన్ ఇన్‌ఛార్జి గార్లపాటి విజయకుమార్, పేర్ల వెంకట మురళీధర్, కిరణ్ పాల్గొన్నారు.

దసరా ఉత్సవ కమిటీలో స్థానం కల్పించండి

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని తెదేపా ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దసరా ఉత్సవ కమిటీలో తెలుగు యువత ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావుకు సభ్యుడిగా అవకాశం కల్పించాలని కోరారు. సెంట్రల్ నియోజకవర్గం తరపున కోటేశ్వరరావుకు స్థానం ఇవ్వాలంటూ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఇచ్చిన సిఫార్సు లేఖను మంత్రికి అందించారు.



మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బాలస్వామి. చిత్రంలో కోటేశ్వరరావు

పేద విద్యార్థులను ఆదుకోవాలి

గాంధీనగర్, న్యూస్‌టుడే : బుడమేరు వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు లోటస్ ల్యాండ్ మార్క్ అసోసియేషన్ సభ్యులు అండగా నిలిచారు. సంఘ అధ్యక్షుడు వెలగా సురేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బొండా ఉమా సూచన మేరకు బుధవారం రాత పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. సురేష్ మాట్లాడుతూ.. వరదతో పేద విద్యార్థులు పుస్తకాలు, బ్యాగులు కోల్పోయారని చెప్పారు. దాతలు స్పందించి వారిని ఆదుకోవాలని కోరారు. సంఘ సభ్యులు కోటేశ్వరమ్మ, డి.శ్రీదేవి, గాయత్రి, సాయిరామ్ చరణ్, వి.గుప్తా, బాబూరావు, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో లోటస్ ల్యాండ్‌మార్క్ సభ్యులు

ఈదురు గాలులు.. విరిగిన వృక్షాలు

సీతారాంపురం, న్యూస్‌టుడే : నగరంలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షంతో పాటు ఈదురు గాలులకు సీతారాంపురం, వారణాసి వారి వీధిలో భారీ చెట్టు విరిగి విద్యుత్తు తీగలపై పడింది. స్తంభం విరిగిపోయింది. అలాగే మాచవరంలోని దుగ్గిరాల బలరామకృష్ణయ్య వీధిలో చెట్టు కొమ్మలు విరిగాయి. సుమారు మూడున్నర గంటల పాటు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఏఈ వెంకట్రావు పర్యవేక్షణలో సిబ్బంది చెట్ల కొమ్మలు తొలగించారు. మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు. శాంతినగర్‌లో పోలేరమ్మ ఆలయంపై చెట్టు కొమ్మలు విరిగిపడడంతో దెబ్బతింది.



వారణాసివారి వీధిలో చెట్టును తొలగిస్తున్న విద్యుత్తు శాఖ సిబ్బంది

దేశ నేతలకు ఘన నివాళి



మహాత్మాగాంధీ, శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సీపీ రాజశేఖరబాబు



ఆంధ్రరత్న భవన్‌లో నరహరిశెట్టి నరసింహారావు, సురేష్, కొలనుకొండ శివాజీ తదితరులు



బెజవాడ బార్ అసోసియేషన్‌లో.. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రమౌళి, శివరామప్రసాద్ తదితరులు

గవర్నర్‌పేట, మధురానగర్, మాచవరం, సీతారాంపురం, న్యూస్‌టుడే : మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రిల జయంతి కార్యక్రమాలను నగరంలో ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు వక్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మాగాంధీ చేసిన నిరుపమాన సేవలను గుర్తు చేసుకున్నారు. ప్రధానమంత్రిగా లాల్‌బహదూర్‌శాస్త్రి దేశానికి చేసిన సేవలను కొనియాడారు. బి.వి.సుబ్బారెడ్డి స్కూలులో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పుచ్చలపల్లి సుందరయ్య పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. వాసవీ భవన్‌లో విద్యార్థులకు పుస్తకాలు అందించారు. గ్రంథాలయాలు, తెదేపా కార్యాలయాలు, కళాశాలల్లోనూ నివాళులు అర్పించారు. దుర్గాఅగ్రహారంలోని వాణీ హైస్కూల్‌లో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు.



26వ డివిజన్ తెదేపా కార్యాలయంలో..



ఎస్సారార్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి, అధ్యాపకులు..

'ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను అడ్డుకుందాం'



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న నర్సింగరావు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను అన్ని రాజకీయ పార్టీలు అడ్డుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. బుధవారం ధర్నా చౌక్‌లో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వేలాది మంది ఉద్యోగులు, కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న కర్మాగారాన్ని భాజపా ప్రభుత్వం ఏకపక్షంగా కార్పొరేట్‌కు అప్పగించేందుకు యత్నించడం సరికాదన్నారు. సొంత గనులు కేటాయించకుండా ఉద్దేశపూర్వకంగానే నష్టాలు వచ్చేలా చేశారని మండిపడ్డారు. ఒప్పంద కార్మికులను తొలగించడం అన్యాయమని చెప్పారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించి భాజపా ప్రభుత్వం తెలుగు ప్రజలకు తీరని ద్రోహం చేస్తోందన్నారు. కార్మికుల పోరాటానికి కిసాన్ మోర్చా అండగా నిలుస్తుందని చెప్పారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు జి.రామన్న, ఎన్.ఎ.శాస్త్రి, ఎం.వి.ఆంజనేయులు, డి.రమాదేవి, సుంకర పద్మశ్రీ, అక్కినేని వనజ, పద్మ, కె.కళ్యాణ్, రాజేష్, సి.హెచ్.కళాధర్, కె.శ్రీనివాస్, ఎం.ఎన్.పాత్రుడు, ఎ.కమల, ఎం.వి.సుధాకర్, కె.దుర్గారావు, ఎం.సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా..

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : వరద బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయి. రాజమహేంద్రవరం రామదాసుపేట క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో ఉందుర్తి రాజా విజయ్‌కుమార్ సహకారంతో ఒక్కొక్కరికి రూ.1500లు విలువ చేసే నిత్యావసరాలు, రూ.500 నగదు ఇచ్చారు. పాస్టర్ దేవరపల్లి అశోక్‌కుమార్ చేతుల మీదుగా వాంబేకాలనీ, రాజీవ్‌నగర్, రాధానగర్ తదితర ప్రాంతాలకు చెందిన 100 కుటుంబాలకు పంపిణీ చేశారు. క్రీస్తు సంఘం సభ్యులు పిల్లల స్వామి, జి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

★ అజిత్‌సింగ్‌నగర్ ఇందిరానాయక్ నగర్‌లో విశ్రాంత పోస్ట్‌మాన్ ఆర్.రామచంద్రరావు.. 200 మంది వరద బాధితులకు సబ్బులు, పేస్టులు, బ్రెడ్లు అందించారు. ప్రభల శ్రీనివాసరావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



రాధానగర్ చర్చిలో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న అశోక్‌కుమార్, పిల్లల స్వామి



మహిళలకు చీరలు అందజేస్తున్న మల్లికార్జున యాదవ్, రాధాకృష్ణరెడ్డి తదితరులు

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే : బుడమేరు వరదల్లో సర్వం కోల్పోయిన మహిళలకు మాజీ కార్పొరేటర్ కాకు మల్లికార్జున యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం భానూనగర్‌లోని తెదేపా కార్యాలయంలో చీరలు పంపిణీ చేశారు. దాత రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మల్లికార్జునయాదవ్ పిలుపుమేరకు చీరాల నుంచి నాణ్యమైన చీరలు తెచ్చి, బాధితులకు అందించినట్లు తెలిపారు. పారిశుద్ధ్య సిబ్బందికీ వాటిని పంచారు.

పేట్రేగుతున్న బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : నగరంలో బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పోలీసుల నిఘా అంతంత మాత్రంగా ఉండడంతో పేట్రేగిపోతున్నారు. అర్ధరాత్రి వేళ ప్రజలపై దాడులకు తెగబడుతూ.. అలజడి సృష్టిస్తున్నారు. రైల్వేస్టేషన్ సమీపంలోని జీఎస్ రాజు రోడ్డులో పరిస్థితి దారుణంగా ఉంది. అర్ధ రాత్రి 12గంటల నుంచి తెల్లవారుజాము 4 వరకు.. బ్లేడ్ బ్యాచ్ సభ్యులు మద్యం మత్తులో.. ప్రజలపై దాడులు చేస్తున్నారు. రోడ్ల వెంట వెళ్లేవారిని బ్లేడ్‌తో గాయపరుస్తున్నారు. గత రెండు రోజుల్లో నలుగురిపై దాడి చేసి, డబ్బులు, సెల్‌ఫోన్లు లాక్కున్నారు. వాటర్ ట్యాంకు సమీపంలోని ఎస్వీఆర్ మోటార్స్ వద్ద బైకును దొంగిలించారు. బస్టాపులు, దుకాణాల వద్ద ఉంచిన వాహనాలను దొంగిలించడం, ఇంటి ముందు నిలిపిన వాహనాల్లో పెట్రోల్ తీయడం చేస్తున్నారు. రాత్రివేళల్లో పోలీసు నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

యువతికి వేధింపులు

మధురానగర్ : పెళ్లి చేసుకోమని యువతి వెంట పడి వేధిస్తున్న యువకుడిపై గుణదల పోలీసులు కేసు నమోదు చేశారు. గుణదల గాంధీజీకాలనీకి చెందిన ఓ యువతి (19) వన్‌టౌన్‌లో పనిచేస్తుంటారు. మంగళవారం రాత్రి పని ముగించుకుని ఇంటికి వస్తుండగా.. మిల్కియా అనే యువకుడు వెంటపడ్డాడు. పెళ్లి చేసుకోమని వేధించాడు. ఆమె నిరాకరించడంతో దుర్భాషలాడాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదైంది.

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : బుడమేరు వరదల్లో మృతి చెందిన ముఠా కార్మికుడు పోలినాయుడు కుటుంబానికి ముఠా వర్కర్స్ యూనియన్ అండగా నిలిచింది. సెప్టెంబరు 1న వచ్చిన వరదల్లో న్యూరాజరాజేశ్వరీపేటకు చెందిన పోలినాయుడు గల్లంతయ్యారు. 15న మృతదేహం లభ్యమైంది. పోలీసులు కేసు నమోదు చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం అందలేదు. రాజీవ్‌గాంధీ హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో ముఠా పని చేస్తున్న పోలి నాయుడు కుటుంబానికి.. తోటి కార్మికులు అండగా నిలిచారు. రూ.55వేలు సేకరించి సిహెచ్.బాబూరావు చేతుల మీదుగా అందించారు. నాయకులు మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.సీతారాములు, సూరి, బి.రమణారావు, కె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



సాయం అందిస్తున్న బాబూరావు తదితరులు

నిందితులపై చర్యలకు విజ్ఞప్తి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : తమ కుమార్తె మృతికి కారకులైన వారితో పాటు సహకరిస్తున్న వైకాపా నాయకులపై తగిన చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా నల్లపాడుకు చెందిన శంకరలీల.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి విజ్ఞప్తి చేశారు. న్యాయవాది సలీంతో కలిసి బుధవారం ఆమె విజయవాడ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న తన కుమార్తె జననీని బండారు ఆనంద్ అనే ఆటో డ్రైవర్ ప్రేమ పేరుతో వంచించాడని ఆరోపించారు. మాయమాటలు చెప్పి ఎత్తుకెళ్లాడని పేర్కొన్నారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. వైకాపా నాయకుల అండదండలతో తిరిగి తమపైనే అక్రమ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. 14 నెలల తర్వాత తమ కుమార్తె ఆస్పత్రిలో శవమై తేలిందని కన్నీటి పర్యంతమయ్యారు. ఏడాది గడుస్తున్నా.. ఇప్పటికీ తమకు న్యాయం జరగలేదని వాపోయారు. న్యాయవాది సలీం మాట్లాడుతూ.. ఈ కేసులో బాధితులకు న్యాయం జరగకపోగా, అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మృతురాలి పెద్దమ్మ ఓంకారమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో న్యాయవాది సలీం, శంకరలీల, ఓంకారమ్మ

రౌడీషీటర్‌పై కేసు

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : స్నేహితుడితో కలిసి వెళుతున్న యువకుడిని బెదిరించి నగదు దోచుకున్న రౌడీషీటర్‌పై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. శాంతినగర్‌కు చెందిన శ్రీకాంత్ (23) మంగళవారం రాత్రి 10.30 గంటల సమయంలో స్నేహితుడు ధీరజ్‌తో కలిసి ఎంకే బేగ్ స్కూలు రోడ్డులో వెళుతున్నాడు. రౌడీషీటర్ మల్లవరపు విజయకుమార్ అలియాస్ జెమినీ, రెడ్డిపోగు గౌతమ్, అనంతకుమార్‌లు అడ్డగించి వారిపై దాడి చేశారు. జేబులో ఉన్న రూ.600లు లాక్కున్నారు. శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రక్షణ కల్పించాలని ప్రేమికుల విజ్ఞప్తి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : కులాంతర వివాహం చేసుకున్న తమను ఇంట్లో వాళ్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, పోలీసులు రక్షణ కల్పించాలని పటమటకు చెందిన చిలక శ్రావణి విజ్ఞప్తి చేశారు. భర్త రామారావుతో కలిసి బుధవారం ఆమె విజయవాడ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. మూడేళ్లుగా ప్రేమించుకుంటున్న తాము.. గత నెల 10వ తేదీన శిర్డీలో వివాహం చేసుకున్నామని తెలిపారు. తన తల్లిదండ్రులు బెదిరించడంతో పటమట పోలీసులను ఆశ్రయించామని, అయినా వేధింపులు ఆపడం లేదని ఆమె వాపోయారు.

నగర పోలీసుల తొలి సారె సమర్పణ



పూజా కార్యక్రమంలో సీపీ రాజశేఖర్‌బాబు దంపతులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే దసరా మహోత్సవాలను పురస్కరించుకొని నగర పోలీసుల తరఫున సీపీ రాజశేఖర్ బాబు దంపతులు తొలి సారెను బుధవారం సంప్రదాయ పద్ధతిలో సమర్పించారు. వన్‌టౌన్ పోలీసుస్టేషను ప్రాంగణంలో రావి చెట్టు వద్ద దుర్గమ్మకు పోలీసు కుటుంబాలతో కలిసి సీపీ దంపతులు పూజ చేశారు. స్టేషను ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అక్కడి నుంచి మేళతాళాలతో అలంకరించిన రథంపై అమ్మవారికి సమర్పించే సారెను దుర్గగుడి టోల్‌గేటు వరకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి కాలి నడకన వచ్చారు. దేవస్థానం ఈవో రామారావు, స్థానాచార్య శివప్రసాద శర్మ సారెను స్వీకరించారు. డీసీపీలు గౌతమి షాలి, ఉదయరాణి, ఉమమహేశ్వర రాజు, కృష్ణమూర్తి నాయుడు, హరికృష్ణ, ఏడీసీపీ రామకృష్ణ, పశ్చిమ ఏసీపీ దుర్గారావు, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ దంపతులు, పోలీసుల అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే ఉత్సవాలు విజయవంతం



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన. పక్కన మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

విద్యాధరపురం, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే దసరా ఉత్సవాలను ప్రతి సెక్టారులోని అధికారులు, సిబ్బంది సమన్వయంతో విజయవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన సూచించారు. తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. 26 సెక్టార్లలో పనిచేసే అధికారులు సిబ్బంది ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 9 గంటల వరకు, రాత్రి 9 నుంచి ఉదయం 7 గంటల వరకు మూడు షిఫ్టులుగా నియమించినట్లు తెలిపారు. జిల్లా అధికారులతోపాటు పోలీసు, పంచాయతీరాజ్, రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్, వైద్య ఆరోగ్యం, అగ్నిమాపక, దేవాదాయ శాఖలకు చెందిన అధికారులు సిబ్బంది ప్రత్యేక బృందాల్లో ఉంటారన్నారు. డ్యూటీ పాయింట్ల వద్ద విధులు నిర్వహించే వారు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే సమాచారాన్ని కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, డీఆర్వో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు


మా దుర్గమ్మ.. బంగారం



నల్లపూసల దండ



మంగళ సూత్రాలు



కిరీటాలు, హారాలు, పాదాలు

కాసులపేరు



పూల జడ



ముత్యాల హారం

వీణ

దసరా ఉత్సవాల్లో ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మ మహిమాన్విత దేశ నలుమూలల నుంచి భక్తులు వేల సంఖ్యలో విచ్చేస్తుంటారు. శరన్నవరాత్రుల్లో దుర్గమ్మ తల్లిని దర్శించుకుంటే జీవితం తరిస్తుందని భావిస్తారు. ఆదే సమయంలో ఉత్సవాల్లో అమ్మవారి అలంకారాలు కూడా ప్రత్యేకతను సంతరించుకుంటాయి. ఇందుకోసం భక్తులు కానుకగా ఇచ్చిన ఆభరణాలతోపాటు సంప్రదాయంగా వస్తున్న వాటిని లోకాలను ఏలే తల్లికి అలంకరిస్తారు. ఆ అలంకారాల్లో ఏ ఆభరణాలు వినియోగిస్తారో తెలుసుకోవాలనే ఆసక్తి భక్తుల్లో ఉంటుంది. **బాలాత్రిపుర సుందరీదేవి:** అభయహస్తాలు, బంగారు పూలజడ, కంఠాభరణాలు, బంగారు వడ్డాణం. **గాయత్రీదేవి:** స్వర్ణ పంచముఖాలు, బంగారు అభయ హస్తాలు, పచ్చల హారం, కంఠాభరణాలు. **అన్నపూర్ణాదేవి :** స్వర్ణ పాత్ర, బంగారు త్రిశూలం, హస్తాలు. **లలితా త్రిపుర సుందరీదేవి :** స్వర్ణ కిరీటం, కంఠాభరణాలు, స్వర్ణాభరణాలు, అభయహస్తాలతో అలంకరిస్తారు. **మహాచండీ దేవి :** సింహవాహనం, కంఠాభరణాలు, ఖడ్గం, కర్ణాభరణాలు, హస్తాలు. **మహాలక్ష్మీదేవి :** గజరాజు, అభయ హస్తాలు, ధనరాశులు, వడ్డాణం, కంఠాభరణాలు, కర్ణాభరణాలు. **సరస్వతీదేవి :** బంగారు వీణ, స్వర్ణహస్తాలు, పగడాల హారం, వడ్డాణంతో అలంకరిస్తారు. **దుర్గాదేవి :** శార్దూల వాహనం, బంగారు త్రిశూలం, సూర్యచంద్రులు, శంకుచక్రాలు. **మహిషాసుర మర్దినిదేవి :** సింహ వాహనం, బంగారు త్రిశూలం, స్వర్ణ ఖడ్గం, కంఠాభరణాలు, కర్ణాభరణాలు. **రాజరాజేశ్వరిదేవి :** స్వర్ణాభరణాలు, అభయహస్తాలు, చెరకుగడతో అలంకరిస్తారు. కాసుల పేరు, బంగారు పూలజడ, దేవిపాదాలు అమ్మవారి రూపాన్ని అనుసరించి వినియోగిస్తారు.

- న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి

నేటి అలంకారం

3-10-2024, గురువారం

శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి



“ అరుణకిరణ జాలై రంజితా సావకాశా
విధృత జపవటీకా పుస్తకా భీతిహస్తా
ఇతర వరకరాఢ్యా ఫుల్లకల్హార సంస్థా
నివసతు హృదిబాలా నిత్యకళ్యాణశీలా ”

దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో మొదటి రోజు జగన్మాత దుర్గాదేవి బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను ఆవహించి ఉండే శక్తి స్వరూపమే త్రిపుర అని త్రిపురారహస్యం ఉపనిషత్తు చెబుతోంది. 'స్వర్గ, భూ, పాతాళం' అనే త్రిపురాల్లో ఉండే శక్తి చైతన్యాన్ని త్రిపురగా వర్ణిస్తారు. శ్రీచక్రంలో ఉండే దేవతల్లో అమ్మవారిలో మొదటి అమ్మయిన త్రిపురసుందరీదేవి. 'శ్రీ' విద్యలో మొదటి విద్య బాల అందుకే శ్రీవిద్యా ఉపాసకులు విధిగా దేవిని మొదట బాల మంత్రాన్ని ఉపాసన చేయడం జరుగుతుంది. త్రిపుర సుందరీ దేవి అభయహస్తముద్రతో చేతిలో అక్షమాల ధరించి ఉంటుంది. మనస్సు, బుద్ధి, అహంకారం ఆమె ఆధీనంలో ఉంటాయి. ఈమెను ఆరాధించడం వల్ల సమస్త మనోవికారాలు తొలగి నిర్మలమైన ఆనందం కలుగుతుందని భక్తుల నమ్మకం. బాలాత్రిపుర సుందరీ దేవిని అరుణవర్ణ వస్త్రాలు ధరించి ఎర్రని పూలతో పూజ చేసి కట్టెపొంగలిని నైవేద్యంగా సమర్పిస్తారు.

సైబర్ నేరగాళ్ల ఆటకట్టించమ్మా..!

విజయవాడ పోలీసుల వినూత్న ప్రచారం



'రా... దుర్గమ్మ దగ్గరకు రా' అని సైబర్ నేరగాడిని లాక్కుని వెళుతున్న పోలీస్ వేషధారి

విజయవాడ నేర వార్తలు, న్యూస్‌టుడే : 'దసరా ఉత్సవాల్లో పది రోజుల పాటు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే అమ్మవారి భక్తులకు సైబర్ నేరాలపై అవగాహన కలిగిస్తాం' పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ప్రకటించారు. బుధవారం సాయంత్రం సైబర్ నేరస్థులను అమ్మవారికి అప్పగించే వినూత్న కార్యక్రమం చేపట్టారు. నేరాలకు పాల్పడే వ్యక్తిని పట్టుకుని దుర్గమ్మ ఆలయానికి మేళతాళాల మధ్య తీసుకు వస్తూ 'దుర్గమ్మా.. సైబర్ నేరగాళ్ల ఆట కట్టించు అంటూ వేడుకున్నారు. కర్రలపై... నేరగాడిని, పోలీసు తీసుకుస్తున్న తీరు అందరినీ ఆకర్షించారు. డప్పుల హోరులో ఎత్తైన కాళ్లపై నడుచుకుంటూ వస్తున్న పోలీసు వేషధారి.. 'ఐ యామ్ సైబర్ సిటిజన్' అంటూ ప్లకార్డు పట్టుకోవడం ఆకట్టుకుంది. ఉత్సవాల సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ సైబర్ నేరాలపై అవగాహన కలిగించేలా సీపీ సమక్షంలో ప్లకార్డులు చేత పట్టి చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. వీరిని సీపీ అభినందించారు.

కనకదుర్గ పైవంతెన వైపు అనుమతి లేదు

గొల్లపూడి, న్యూస్‌టుడే: దసరా నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని భారీ, గూడ్స్ వాహనాలను విజయవాడ నగరం, కనకదుర్గ పైవంతెన వైపు అనుమతించడం లేదని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. గొల్లపూడి వైజంక్షన్ వద్ద నుంచి వాహనాలను మళ్లిస్తున్నట్లు వెల్లడించారు. ఏలూరు, గుంటూరు వైపు వెళ్లే వాహనాలు కబేళా, సీవీఆర్ పైవంతెన, పైపులరోడ్డు, రామవరప్పాడు మీదుగా వెళ్లాలని సూచించారు. ఇబ్రహీంపట్నం నుంచి గొల్లపూడి వరకు బోర్డులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

వాహనాల మళ్లింపు వివరాల ఫ్లెక్సీ



రైళ్లన్నీ బెజవాడ వైపే..!



దేశం నలుమూలల నుంచి భక్తుల రాక

దసరా వేళ.. సౌకర్యాలు పెంచాలి

విజయవాడ, న్యూస్‌టుడే

బెజవాడలో నిర్వహించే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు దేశ నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. నిత్యం వందలాది రైళ్లు విజయవాడ మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఎక్కువ మంది వీటినే ఆశ్రయిస్తుంటారు. ఏ బండి చూసినా.. కిక్కిరిసిపోతుంది. రద్దీకి అనుగుణంగా ఇక్కడి స్టేషన్‌లో వసతులు పెంచాల్సి ఉంది. అరకొర సౌకర్యాలు ప్రయాణికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. జేబుదొంగల సమస్య అధికంగానే ఉంది. రైల్వే అధికారులు ఒకవైపు చర్యలు తీసుకుంటున్నా.. పూర్తిస్థాయిలో ఫలితాలు లభించడం లేదు.

రోజువారీ ప్రయాణికుల రాకపోకలు : సీజన్‌లో రెండు లక్షలు, అన్‌సీజన్‌లో లక్ష వరకు
రైళ్లు : 250కి పైగానే..

దొంగల భయం..

విజయవాడ రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కేందుకు వేచి ఉండే ప్రయాణికులకు దొంగల బెడద తప్పడం లేదు. కళ్లుమూసి తెరిచేలోపే.. బ్యాగులు, సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను చోరీ చేస్తున్నారు. బుకింగ్ కౌంటర్లలో హడావుడిగా టిక్కెట్లు తీసుకునే వారిని లక్ష్యంగా చేసుకుంటారు. వారి జేబులను కత్తిరించి, పర్సులు నొక్కేస్తున్నారు. అన్ని ప్లాట్‌ఫారాల్లోనూ ఇలాంటి పరిస్థితి నెలకొంది. ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.



నాసిరక ఆహార పదార్థాలు

రైల్వేస్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫారాలలో నాసిరకం ఆహార పదార్థాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అధికారులు తనిఖీలు చేస్తున్నా పెద్దగా ఫలితాలు ఉండడం లేదు. మార్పు కనిపించడం లేదు. ప్రయాణికులు ఆర్థికంగా నష్టపోతున్నారు. అనారోగ్యంపాలవుతున్నారు. నాసిరకం దందాకు అడ్డుకట్ట వేయాలి.

తక్కువ ధరకే అందించాలి

రైలు ప్రయాణికుల్లో అత్యధిక శాతం పేద, మధ్య తరగతి వర్గాలే ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. ఆహార పదార్థాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. తక్కువ ధరకే అందించే 'జనాహార్' స్టాళ్లు ఎక్కువగా లేవు. దసరా రద్దీని దృష్టిలో పెట్టుకొని అన్ని ప్లాట్‌ఫారాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి.

అదనపు రైళ్లు నడపరూ..

దసరా, దీపావళి, క్రిస్మస్ పండగలను దృష్టిలో పెట్టుకొని అదనంగా ప్రత్యేక రైళ్లు నడపాలి. నిర్వహణ పనుల దృష్ట్యా రైల్వే శాఖ ఇప్పటికే ఉన్న వాటిలో కొన్నింటిని రద్దు చేసింది. రద్దీ ఎక్కువగా ఉండే ఈ సీజన్‌లో.. ప్రత్యేక రైళ్లు నడపడం ద్వారా ప్రయాణికులకు సౌకర్యావంతంగా ఉంటుంది. ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుంది. డిమాండ్ అధికంగా ఉండే హౌవ్‌డా, బెంగళూరు, సికింద్రాబాద్ మార్గాల్లో సర్వీసులు పెంచాలి.



అనదపు కౌంటర్లు అవసరం

ప్రధాన రిజర్వేషన్ కార్యాలయంలో.. దసరా పండగ పది రోజులూ అదనంగా కౌంటర్లు ఏర్పాటు చేయాలి. రద్దీ ఎక్కువ ఉంటున్నా.. కౌంటర్లు ఏర్పాటు చేయడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అన్ని రైళ్లలో రిజర్వేషన్లు పూర్తవడంతో తత్కాల్ టికెట్లకు డిమాండ్ పెరిగింది. అవి పక్కదారి పట్టకుండా రైల్వే పోలీసులు నిఘా ఉంచాలి.

నిలువ దోపిడీకి అడ్డుకట్ట పడేనా..

రైలు దిగి ఇంటికి చేరుకునే ప్రయాణికులను. . కొందరు ఆటో వాలాలు నిలువదోపిడీ చేస్తున్నారు. రైల్వేస్టేషన్ ట్రాఫిక్ బూత్‌లో సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో.. ఎక్కువ ధరలు వసూలు చేస్తున్నారు. అదేమని అడిగితే.. ఎదురు దాడి చేసే పరిస్థితులు ఇక్కడున్నాయి. డ్రైవర్లందరూ ఏకమై.. ప్రయాణికుల మీదకు వెళ్లి భయాందోళనలకు గురిచేస్తున్నారు. రాత్రి సమయాల్లో ఈ దోపిడీ తారస్థాయిలో ఉంటోంది.

ఉరకలెత్తిన ఉత్సాహం.. అడుగడుగునా నీరాజనం



స్కాట్స్ విద్యార్థులతో చంద్రబాబు



పారిశుద్ధ్య కార్మికుల హర్షాతిరేకాలు



బాబుకు గజమాలతో సత్కారం

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదటిసారి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మచిలీపట్నం రావడంతో తెదేపా శ్రేణులు, కూటమి నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. నగరంలోని ఆంధ్ర జాతీయ కళాశాలలో హెలీప్యాడ్ దిగిన దగ్గర నుంచి ప్రజా వేదిక సభ నిర్వహించి తితిదే కల్యాణ మండపానికి వచ్చేవరకు రహదారి పొడవునా కూటమి నాయకులతోపాటు ప్రజలు విజయ సంకేతం చూపుతూ, నమస్కరించారు. చరవాణీలు పట్టుకుని చిత్రాలు తీస్తూ కనిపించారు. వేదిక వద్ద సభా ప్రాంగణం అంతా నిండిపోవడంతో మండపంలోని హాల్లో డిజిటల్ తెర ఏర్పాటు చేసి కుర్చీలు వేయగా అది కూడా నిండిపోయింది. ముఖ్యమంత్రి నగరంలో దీర్ఘకాలిక సమస్య అయిన డంపింగ్‌యార్డుతోపాటు కోనేరు సెంటరులో సుందరీకరణ పనులు పరిశీలించారు. స్వచ్ఛ కార్యక్రమాల్లో పాల్గొన్న స్కాట్స్ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఐవీఆర్ఎస్ ద్వారా నగరంలోని సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇవ్వడంతోపాటు ప్రభుత్వ వైద్యకళాశాలకు పింగళి నామకరణం చేసేందుకు కృషి చేస్తామని చెప్పడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వివిధ సంస్థలు, ప్రజలు అందించిన అర్జీలను స్వీకరించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలోని వివిధ డివిజన్‌లలో పనిచేస్తున్న స్వచ్ఛ సేవకులను సత్కరించి, పురస్కారాలు అందజేశారు. పురస్కారాలు అందుకున్న కార్మికులు ప్రభుత్వతీరు, వారికి కల్పించిన వసతులపై చంద్రబాబు సమక్షంలోనే వెల్లడించారు.

కుటుంబసభ్యుల్లా చూశారు



తెల్లవారక ముందే లేచి నగరంలోని ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపడుతుంటాం. ఇబ్బంది అయినా సరే నగర పరిశుభ్రత కోసం కృషి చేస్తాం. అలాంటి మమ్మల్ని ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల్లా చూడటం ఎంతో సంతోషంగా ఉంది. వరదల సమయంలో విజయవాడలో పనిచేయడానికి వెళ్లిన సమయంలో ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ, అన్ని వసతులు అందించేలా అధికారులను ఆదేశించారు. 75 ఏళ్ల వయసున్న వ్యక్తి నీళ్లలో తిరుగుతూ కన్న తండ్రి పిల్లలను కంటికి రెప్పలా కాపాడినట్లు ముఖ్యమంత్రి అలా ప్రజలను కాపాడుతూ వస్తున్నారు. అలాంటి ముఖ్యమంత్రి చేతుల మీదుగా స్వచ్ఛ పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉంది. **- ఝాన్సీలక్ష్మి**

భరోసా ఇచ్చారు



మచిలీపట్నం నుంచి 200 మంది వరకు పారిశుద్ధ్య కార్మికులు విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో సేవలు అందించేందుకు వెళ్లాం. కొత్త ప్రాంతమైనా సరే ముఖ్యమంత్రి ఇచ్చిన భరోసాతో పని కష్టమైనా ఇష్టంగా చేయగలిగాం. వరదల్లో ముఖ్యమంత్రి మా ముందు ఉండి నడిపించడం సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపుతో తెదేపా కార్యకర్తలు కూడా మాతోపాటు పనిచేశారు. అభివృద్ధి కోసం తపించే ముఖ్యమంత్రి చేతులమీదుగా పురస్కారం అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను. **- విజయలక్ష్మి**

ఆరోగ్య పరీక్షలు చేయించారు: దుర్గాప్రసాద్



నాలాంటి కార్మికులు వేలాది మంది విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో పనిచేశాం. అక్కడకు వెళ్లే ముందు వసతులు ఎలా ఉంటాయో అని ఆందోళన చెందాం. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో భోజనంతోపాటు అన్ని వసతులు కల్పించారు. అక్కడ ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతోపాటు, తిరిగి మచిలీపట్నం వచ్చిన తరువాత కూడా మళ్లీ పరీక్షలు చేశారు. ఇలా ముఖ్యమంత్రి కార్మికులతో ప్రత్యేక శ్రద్ధ చూపారు.

చంద్రబాబు లెజెండ్: శ్రీనివాసరావు



నేను 23 ఏళ్లుగా పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాను. వరద ప్రభావిత ప్రాంతాలను చూస్తే మాకే భయం వేసింది. అలాంటి చోట్ల ముఖ్యమంత్రి పర్యటించారంటే ఆయన పనితీరు అర్థం చేసుకోవచ్చు. వరద నీళ్లలో కూడా మావద్దకు వచ్చి తమ్ముళ్లూ ఎలా ఉన్నారని అడగడం ఎంతో సంతోషంగా ఉంది. నాకు 52 ఏళ్లు. అనేక అనారోగ్య సమస్యలున్నాయి. ముఖ్యమంత్రి వయసు 75 ఏళ్లయినా లెజెండ్‌లా పనిచేస్తున్నారు. మరో పదేళ్లపాటు ఆయనే ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నాను.



సీఎం నుంచి స్వచ్ఛత అవార్డులు అందుకున్న పారిశుద్ధ్య కార్మికులు



రంగుల ముగ్గుతో స్వచ్ఛతా హీ సేవ అలంకారం



పారిశుద్ధ్య కార్మికురాలిని ఆప్యాయంగా పలకరిస్తూ..

ఆక్రమణలు తొలగించాలి

స్వచ్ఛ చల్లపల్లి కోసం పదేళ్లుగా నిరంతర కార్యక్రమాలు చేస్తున్నాం. అలా గ్రామాల్లో అందరూ ఐక్యంగా ఉంటూ స్వచ్ఛపల్లెల కోసం కృషి చేస్తే స్వచ్ఛభారత్ కల సాకారం అవుతుంది. డ్రైన్‌లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వల్ల ఏర్పడుతున్న సమస్యలను గుర్తించాం. వాటిని తొలగించి మురుగు పారేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడంతో పాటు అధికారికంగా చేపట్టే పనులకు నిధులు విడుదల చేయాలని కోరుతున్నాం. **- డీఆర్‌కే ప్రసాద్, స్వచ్ఛ చల్లపల్లి రథసారథి**



మేమున్నామని వరద బాధితుల సహాయార్థం ఈనాడు రిలీఫ్ ఫండ్‌కు రూ.లక్ష విరాళం అందజేసిన కోనేరు ఛారిటబుల్ ట్రస్టు ప్రెసిడెంట్ కె.నరేంద్రబాబు, ట్రస్టు కార్యవర్గ సభ్యులు. - ఈనాడు, అమరావతి

పట్టభద్రులూ.. ఓటు నమోదు చేసుకోండి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదుకు నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. మండలాల్లో తహసీల్దార్, ఎంపీడీవో, రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో ఓటరు దరఖాస్తు ఫారం-18 పూర్తి చేసి.. విద్యార్హతలకు సంబంధించిన నకళ్లు గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించి ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. రెండు ఉమ్మడి జిల్లాల్లో 188 సహాయ ఓటరు నమోదు అధికారులు, 104 డిజిగ్నేటెడ్ అధికారులు, 119 అదనపు డిజిగ్నేటెడ్ అధికారులు అందుబాటులో ఉన్నారన్నారు. పట్టభద్రులు నవంబర్ 6వ తేదీ లోపు ఓటరు నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని చెప్పారు.